www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -285 బుధవారం 21 జనవరి 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# ఏఐతో మెరుగైన పాలన

## ఏఐ రంగంలో తెలంగాణతో భాగస్వామ్యం -ఆసక్తి కనబర్చిన రాయల్ ఫిలిప్స్

## హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటుపై చర్చ






హైదరాబాద్,**జనవరి 20ప్రజావినికిడి** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో తెలంగాణతో భాగస్వామ్య మయ్యేందుకు ప్రముఖ హెల్త్ టెక్ సంస్థ రాయల్ ఫిలిప్స్ ఆసక్తి చూపింది. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు అవకాశాలపై కూడా చర్చించేందుకు ముందుకొచ్చింది. ప్రపంచ ఆర్థిక వేదిక-2026 వార్షిక సమావేశాల్లో భాగంగా స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం ఫిలిప్స్ గ్లోబల్ నాయకత్వంతో భేటీ అయ్యారు. రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ గ్లోబల్ హెడ్ జాన్ విల్లెమ్ స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఏఐ రంగంలో తెలంగాణ చేపడుతున్న కార్యక్రమాలు తమను ఆకట్టుకున్నాయని చెప్పారు. ముఖ్యంగా ఆరోగ్య రంగంలో తెలంగాణ అమలు చేస్తున్న ఏఐ ఆధారిత సేవలపై ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వంమిగతా 2లో...

# 27న మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ?

## ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో ఈసీ వీడియో కాన్ఫరెన్స్

## 23 వరకు జిల్లా ఎన్నికల అధికారులతో వరుస సమావేశాలు

## నేడు ఆర్వోలు, ఏఆర్వోలకు శిక్షణ

## ఎన్నికలకు సిద్ధంగా ఉండండి : అధికారులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఆదేశం




**హైదరాబాద్జనవరి 20ప్రజావినికిడి**
ఈ నెల 24 లేదా 27న మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మున్సిపల్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలకు జరగబోయే రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ముందస్తుగా చేపట్టాల్సిన చర్యలపై ఆమె మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లా కలెక్టర్లతో హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల్లో గుర్తించిన పోలింగ్ స్టేషన్ల వారీగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది, బ్యాలెట్ బాక్స్‌ల తరలింపునకు సంబంధించి రవాణా తదితర అంశాలపై వారికి పలు సూచనలు చేశారు.మిగతా 2లో...

# నా బాస్ నబిన్

## మోడీ చమత్కారం

**బిజెపి కొత్త సారథిగా నితిన్ నబిన్ సిన్హా**
**పార్టీ కార్యాయలంలో అధ్యక్ష బాధ్యతలు స్వీకరణ**
**హాజరైన ప్రధాని మోడీ, నడ్డా, అమిత్ షా, రాజ్‌నాథ్, గడ్కరీ**
**వివిధ అంశాలపై నితిన్ భావోద్వేగ ప్రసంగం**



న్యూఢిల్లీ,**జనవరి 20ప్రజావినికిడి** భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన నితిన్ నబీన్ సిన్హా మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఆయన జాతీయ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోదీ సమక్షంలో కమల దళపతిగా నితిన్ ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ తదితరులు హాజరయ్యారు. నితిన్ నబిన్ ఎన్నికైనట్లు పత్రాన్ని డాక్టర్ కె.లక్ష్మణ్ అందచేశారు. అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. భారత్ మాతాకీ జై అంటూమిగతా 2లో...

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

## ఒక తరం అభివృద్ధి చెందేలా ప్రభుత్వ నిర్ణయాలు

## 'వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రైన్యూర్'పై చర్చలో సీఎం చంద్రబాబు

అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేయాలన్న సంకల్పంతోనే వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రైన్యూర్ విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కుటుంబంలోని ఒక తరానికి మేలు చేయాలన్నారు. తన ఆలోచనలు ఎప్పుడూ ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిపైనే ఉంటాయని చెప్పారు. దావోస్ ఆర్థిక సదస్సులో పలువురు పారిశ్రామికవేత్తలతో ఆయన భేటీ అయ్యారు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రైన్యూర్ విధానంపైమిగతా 2లో...




# యూరియా యాప్ పై కేంద్రం ప్రశంసలు

**ఖరీఫ్ కల్లా అన్ని జిల్లాలలో యాప్ సేవలు అమలు**
**సేంద్రియ, ఆర్గానిక్ వ్యవసాయాలు చేసేలా రైతులను ప్రోత్సహించాలి**
**ఆర్గానిక్ పంటలకు సర్టిఫికేషన్ ఇచ్చేలా త్వరలో సర్టిఫికేషన్ యాప్**
**అన్ని కమిటీలలో రైతుల ప్రాతినిధ్యం ఉండేలా చూడాలి**
**అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల ఆదేశం**



హైదరాబాద్,**జనవరి 20ప్రజావినికిడి**
:రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్ ను కేంద్ర ఫెర్టిలైజర్ శాఖ అభినందించిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. వచ్చే ఖరీఫ్ కల్లా ఈ యాప్ ను రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి తేవాలని అన్నారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్, కో-ఆపరేషన్ మరియు హార్టికల్చర్ శాఖల పురోగతిపై వ్యవసాయశాఖ సెక్రటరి మరియు ఆయా శాఖల డైరెక్టర్లు, ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం మరియు తెలంగాణ విజన్ 2047 కార్యాచరణ ప్రణాళికలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, అలాగే ప్రభుత్వం చేపడుతున్న మిగతా 2లో...

# ధాన్యం కొన్న వెంటనే నగదు జమ

## అధికారులకు మంత్రి నాదెండ్ల ఆదేశం



విజయవాడ,**జనవరి 20ప్రజావినికిడి**
ఇకపై ఉదయం ధాన్యం కొంటే.. అదే రోజు సాయంత్రానికి నగదు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశించారు. రబీ ధాన్యం కొనుగోలుకు పూర్తిస్థాయిలో సిద్ధంమిగతా 2లో...

# చలాన్ల వసూళ్ల కోసం వేధించవద్దు

## ట్రాఫిక్ పోలీసులకు హైకోర్టు ఆదేశం




హైదరాబాద్,**జనవరి 20ప్రజావినికిడి** వాహన చలాన్లపై వాహనదారులను వేధింపులకు గురి చేయవద్దని ట్రాఫిక్ పోలీసులకు తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్ చలాన్ల కోసం వాహనదారులను బలవంతం చేయవద్దని తేల్చి చెప్పింది.మిగతా 2లో...

# సిట్ ఎదుట 7 గంటలు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీశ్‌రావును విచారించిన అధికారులు


**నాకు సంబంధం లేదన్న మాజీమంత్రి**
**ఆధారాలు ఉన్నాయి కాబట్టే పిలిచామన్న పోలీసులు**
**ఉంటే ఆధారాలు చూపాలన్న హరీశ్**
**ఏసీపీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఆందోళనలు, అరెస్ట్‌లు**
**పరిస్థితి ఉద్రిక్తం.. పలువురిని అదుపులోకి తీసుకున్న అధికారులు**



హైదరాబాద్,**జనవరి 20ప్రజావినికిడి**
రాష్ట్రంలో ప్రకంపనలు రేపిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావును సిట్ అధికారులు దాదాపు ఏడు గంటల పాటు సుదీర్ఘంగా విచారించారు. మధ్య మధ్యలో విరామమిస్తూ అధికారులు హరీశ్‌రావుకు ప్రశ్నలు సంధించగా మధ్యలో హరీశ్‌రావు సైతం సిట్ అధికారులకు మిగతా 2లో...

# తదుపరి దర్యాప్తు అవసరమా ?

**వైఎస్ వివేకా హత్య కేసు..**
**సీబీఐని ప్రశ్నించిన ధర్మాసనం**
**ఎవరిని విచారించాలనుకుంటున్నారో చెప్పాలని ఆదేశం**
**తదుపరి విచారణ ఫిబ్రవరి 5కి వాయిదా**



న్యూఢిల్లీ,**జనవరి 20ప్రజావినికిడి**
మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో సుప్రీంకోర్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తు అవసరమా? అనే అంశంపై సీబీఐని సుప్రీంకోర్టు స్పష్టంగా ప్రశ్నించింది. ఎవరిని కస్టడీలోకి తీసుకునిమిగతా 2లో...

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# యూరియా యాప్ పై కేంద్రం ప్రశంసలు

(మొదటి పేజీ తరువాయి)
అభివృద్ధి పథకాలు రైతులకు పూర్తిస్థాయిలో చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు సూచించారు. సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆర్గానిక్ పంటలు పండిస్తున్నప్పటికి, మార్కెట్లో నకిలీ ఆర్గానిక్ లేబుల్లతో నకిలీ ఉత్పత్తులు చలామణీ అవుతున్నందున నిజమైన ఆర్గానిక్ పంటలు పండించే రైతులకు నష్టం చేకూరుతుందని మంత్రిగారు అన్నారు. ఇందుకోసం వ్యవసాయశాఖ ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇచ్చే విధంగా ఒక యాప్ తీసుకురానుందని అన్నారు. ఈ యాప్ ద్వారా కొనుగోలుదారు తాను కొనబోయే ఉత్పత్తి ఎక్కడ, ఏ రైతు, ఎలా పండించాడో తెలుసుకుంటాడని అన్నారు. అదేవిధంగా అగ్రివర్సిటీలలోని ఖాళీ ప్రదేశాలలో ఆర్గానికి పంటలు పండించి, అక్కడే స్టాల్స్ పెట్టి అమ్మిన్లటైతే రైతులు ఆర్గానిక్ పంటలవైపు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు.
÷ాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరించిన వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ఇప్పటికే 50 కోట్లు ఖర్చు చేశామని, ఇంకా 50 కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు రైతులకు కావాల్సిన యంత్రాలు మార్కెట్ ధరలకే లభించేలా, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ నేరుగా రైతులకు చేరేలా నిబంధనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పట్టించుకోని కేంద్ర ప్రాయోజిత పథకాలను తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గౌరవ ముఖ్యమంత్రిగారి ఆదేశాలనుసారం ఒకొక్కటిగా పునరుద్ధరిస్తోందని, అందులో భాగంగా ఈ సంవత్సరం వివిధ పథకాల క్రింద ఇప్పటికే రూ.500 కోట్లు
ఖర్చు చేశామని తెలిపారు. కేంద్రం నుంచి వచ్చే ప్రతి పైసను పూర్తిగా సద్వినియోగం చేసుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని, కేంద్రం నుంచి వచ్చే ఒక్క పైసా కూడా వృథాగా తిరిగి వెళ్లకూడదని అధికారులకు సూచించారు. చ్చే ఖరీఫ్ నాటికి పెద్దమొత్తంలో యూరియా బఫర్ స్టాక్ లను నిల్వలో ఉంచుకోవాలని, భవిష్యత్తులో యూరియా ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని, రైల్వే రేక్ పాయింట్లను కూడా ఎరువుల పంపిణీకి తగ్గట్లుగా ఉండేలా, మరికొన్ని రైల్వే రేక్ పాయింట్లను అదనంగా ఏర్పాటు చేసేవిధంగా రైల్వే అధికారులను కోరాలని సూచించారు. ÷ాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సన్నాలకు బోనస్ ఇస్తున్నందున, పంటకాలనికి అనుగుణంగా వ్యవసాయశాఖ ద్వారా సన్న వడ్లలో మేలైన వంగడాలను సూచించాలని, రైతులు అట్టి రకాలను ఉత్పత్తి చేసి మంచిధర పొందేటట్లు చూడాలని అన్నారు. ధికశాతం ఖచ్చితత్వంతో శాటిలైట్ మ్యాపింగ్ త్వరితగతిన పూర్తి చేయాలని, ఈ నెలాఖరు నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంటల శాటిలైట్ మ్యాపింగ్ డేటా రావాలని అధికారులను ఆదేశించారు. 3 సంవత్సరాల పంటల శాటిలైట్ మ్యాపింగ్ తో డేటా అందించాలని, డేటా ÷నైలైజ్ చేసేముందు ఒకసారి అధికారులతో ఫీల్డ్ వెరిఫికేషన్ చేయించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన అన్ని శాఖల డిపాజిట్లు ప్రైవేట్ కమర్షియల్ బ్యాంకులలో కాకుండా కో-ఆపరేటివ్ మరియు అర్బన్ కోఆపరేటివ్ బ్యాంకులలో చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. అందుకోసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. ఆయిల్ పామ్ ప్లాంటేషన్ లో కేంద్రం ఇచ్చిన లక్ష్యానికి రెట్టింపు ఎ÷-లాంటేషన్ జరిగేలా అధికారులు పనిచేయాలని మంత్రి అన్నారు. తక్కువ పురోగతి ఉన్న ఆయిల్ పామ్ కంపెనీలను రద్దు చేసి, వాటిని ఆయిల్ ఫెడ్ సంస్థకు గాని, వేరే ఇతర కంపెనీలకు కేటాయించాలన్నారు. ఆయిల్ పామ్ కంపెనీలకు సంబంధించిన ఖాళీ ప్రదేశాలలో మోడల్ పామ్ అభివృద్ధి చేసి, ఆయిల్ పామ్ రైతుల సందర్శనార్థం ఉంచిన్లటైతే, వారికి వచ్చే అనుమనాలను కూడా నివృత్తి చేసుకోవడానికి వీలు కలుగుతుందని అన్నారు. పామ్ ఆయిల్ పై దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పెంచేలా కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# ఏఐతో మెరుగైన పాలన

(మొదటి పేజీ తరువాయి)
తాజాగా విడుదల చేసిన 'తెలంగాణ నెక్ట్స్ జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-2030' గురించి ప్రతినిధి బృందం వివరించింది. 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించడమే ఈ విధాన లక్ష్యమని, మెడికల్ ఎలక్ట్రానిక్స్ సహా అనుబంధ రంగాలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామని తెలిపారు.
÷ఖఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ఔషధ తయారీ, పరిశోధనాభివృద్ధి (ఆర్ అండ్ డీ) రంగాల్లో ప్రపంచ స్థాయి, స్థిరమైన పారిశ్రామిక క్లస్టర్‌ను తెలంగాణలో నిర్మిస్తున్నామని చెప్పారు. 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లో భాగంగా ఔటర్ రింగ్ రోడ్ , రీజినల్ రింగ్ రోడ్ మధ్యనున్న ప్రాంతంలో పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ తయారీ, లాజిస్టిక్స్ కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కొత్త లైఫ్ సైన్సెస్ విధానం, ఔషధ తయారీ వ్యూహాలు కలిసి తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు పునాది వేస్తాయని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికే 2,000కు




పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, బలమైన ఐటీ?లైఫ్ సైన్సెస్?హెల్త్ కేర్ టాలెంట్ బేస్, జీనోమ్ వ్యాలీ, 300 ఎకరాలకుపైగా విస్తరించిన మెడికల్ డివైసెస్, మెడికల్ ఎలక్ట్రానిక్స్ పార్క్ ఉన్నాయని మంత్రి వివరించారు. హైదరాబాద్ వైద్య పర్యాటకానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని, ఇక్కడి ఆస్పత్రులు ఇప్పటికే క్రిటికల్ కేర్, అంబులెన్స్ సేవలు వంటి రంగాల్లో ఏఐను సమర్థవంతంగా వినియోగిస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో హైదరాబాద్‌ను ఏఐకు కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏఐ సిటీని నిర్మిస్తున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. 'ఇదే సరైన సమయం. హైదరాబాద్‌లో నాలెడ్జ్ హబ్ ఏర్పాటు చేయడానికి ఇది ఉత్తమ అవకాశమని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు వచ్చి.. జీనోమ్ వ్యాలీని సందర్శించాలని మంత్రి ఫిలిప్స్ నాయకత్వాన్ని ఆహ్వానించారు. తెలంగాణ లైఫ్ సైన్సెస్ డైరెక్టర్ శక్తి నాగప్పన్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో ఇప్పటికే మెడ్ ట్రానిక్, ఒలంపస్, జీఈ వంటి అగ్రశ్రేణి సంస్థల ఎంబెడెడ్ ఇంజినీరింగ్, ఆర్ అండ్ డీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు.రాయల్ ఫిలిప్స్ వైస్ ప్రెసిడెంట్ జాన్ విల్లెమ్ స్కీజ్ గ్రాండ్ మాట్లాడుతూ.. ఆరోగ్య రంగంలో తెలంగాణ చేపడుతున్న ఏఐ ఆధారిత మార్పు అత్యంత ప్రశంసనీయమని అన్నారు. తమ నెదర్లాండ్స్ ప్రధాన కార్యాలయాన్ని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సందర్శించాలని ఆయన ఈ సందర్భంగా ఆహ్వానించారు.

# నా బాస్ నబిన్ : మోడీ చమత్కారం

(మొదటి పేజీ తరువాయి)
తన ప్రసంగాన్ని మొదలుపెట్టిన ఆయన.. 'ముందుగా మీ అందరికీ నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఒక సాధారణ కార్యకర్తనైన నన్ను పార్టీలోనే అత్యంత ఉన్నతమైన పదవికి చేరేలా చేశారు. నేను మీకు తలవంచి నమస్కరిస్తున్నాను' అని అన్నారు.జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ సిన్హా.. ప్రధాని మోదీపై ప్రశంసల జల్లులు కురిపించారు. ఆయనకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధాని మోదీ నిరంతరంగా దేశం కోసం పాటుపడుతున్న తీరును సాధారణ కార్యకర్తలమైన తాము గమనిస్తూనే ఉన్నామన్నారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'అది నేను నేషనల్ జనరల్ సెక్రటరీగా ఉన్న సమయం. అప్పుడు మీరు(ప్రధాని మోదీ) సభావన మిషన్ ప్రోగ్రామ్ సందర్భంగా ప్రతీ ఒక్కరి కష్టాలను అడిగి తెలుసుకోవటం చూశాను. ఆ ప్రోగ్రామ్ తర్వాత మేము మీ గ్రీన్ రూములో మిమ్మల్ని కలిశాము. గుజరాత్ నుంచి చాలా మంది ఆ ప్రోగ్రామ్‌కు ఎందుకు వస్తున్నారో భావోద్వేగపూరితంగా మీరు మాకు వివరించారు. ప్రజల ఎమోషన్స్‌తో కనెక్ట్ అయ్యే వారే గొప్ప నాయకులు అవుతారని నాకు అప్పుడు అర్థమయింది' అని చెప్పారు. సందర్భంగా నితిన్ నబీన్ ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తమిళనాడు ప్రభుత్వం



తిరుప్పరన్కుంద్రం కొండపై కార్తీగై దీపం పండుగ జరగకుండా ఆపడాన్ని ఆయన తప్పుబట్టారు. సోమనాథ్, రామ సేతు, ఇతర చిహ్నాల గురించి మాట్లాడితే ప్రతిపక్ష పార్టీలు అసహనానికి గురవుతాయని అన్నారు. రామసేతు లేదు అనే వారికి, కార్తీగై దీపం పండుగను అడ్డుకునే వారికి భారత రాజకీయాల్లో చోటులేదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. నితిన్ నబీన్‌ను ప్రశంసించారు. ఇప్పుడు నబీన్ తనకు బాస్ అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. నబీన్ తనకు బాస్ అని, తాను సాధారణ పార్టీ కార్యకర్త అని వ్యాఖ్యానించారు. 'భాజపాలో సాధారణ కార్యకర్త కూడా జాతీయ అధ్యక్షుడు కాగలరు. భాజపాలో నిర్ణయాలు, ఎంపిక అన్నీ.. ప్రజాస్వామ్యయుతంగానే ఉంటాయి. దేశసేవ, ప్రజాసేవ లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు పనిచేస్తున్నారు. గతంలో ఆడ్వాణీ, వెంకయ్యనాయుడు నేతృత్వంలో ఘన విజయాలు సాధించాం. అందరి కృషితోనే మూడుసార్లు అధికారంలోకి వచ్చేలా పార్టీ ఎదిగింది. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు పార్టీ నిర్మాణం పటిష్టంగా ఉంది. భాజపా కార్యకర్తను అనిపించుకోవడమే నాకు గర్వకారణం. భాజపాలో ప్రత్యేకంగా పదవులు, బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం లేదు. ప్రతిఒక్క
కార్యకర్త స్వయంగా బాధ్యతలు తీసుకోవాలి. బాధ్యతలు ఒకరి నుంచి ఒకరికి మారతాయి.. లక్ష్యం మారదు. నాయకత్వం మారినా.. మన గమ్యం మారదు. భాజపా చేతిలోనే దేశం సురక్షితంగా ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని మోదీ అన్నారు.
45 ఏళ్ల నితిన్ నబీన్ కమల దళపతిగా నిన్న ఏకగ్రీవంగా ఎన్నికైన సంగతి తెలిసిందే. పార్టీ చరిత్రలోనే చిన్న వయసులో జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఘనతను ఆయన సాధించారు. ఉమ్మడి బిహార్ నుంచి పార్టీ అధ్యక్ష స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ నిలిచారు. ప్రమాణ కార్యక్రమానికి పలు రాష్ట్రాల నేతలు, ఎంపిలు, కేంద్రమంత్రులు హాజరయ్యారు.

# 27న మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ?

(మొదటి పేజీ తరువాయి)
టీ పోల్ యాప్‌లో పోలింగ్ స్టేషన్ల వారీగా ఓటర్లను మ్యాపింగ్ చేయడంపై దిశానిర్దేశం చేశారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లో మున్సిపల్ ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం ఉమ్మడి నిజామాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో వీసీ నిర్వహించనున్నారు. గురువారం ఉమ్మడి నల్లగొండ, మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్లతో, ఈనెల 23న రంగారెడ్డి, మేడ్చల్, ఉమ్మడి మెదక్ జిల్లాల కలెక్టర్లతో ఎస్‌ఈసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎన్నికల ఏర్పాట్లు, సన్నద్ధతపై చర్చించనున్నారు.
మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు రాష్ట్ర ప్రభుత్వం శనివారమే లేఖ రాసింది. రిజర్వేషన్ల ప్రక్రియ వివరాలను సమర్పించిన నేపథ్యంలో ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నట్టు ఎన్‌ఈసీకి తెలిపింది. అన్ని జిల్లాల కలెక్టర్లు సమర్పించిన కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్మెన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ సభ్యుల గెజిట్‌లను ప్రభుత్వం ఎస్‌ఈసీకి పంపింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. దీనికి సంబంధించి తీవ్ర కసరత్తు చేసింది. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు లాటరీ విధానంలో రిజర్వేషన్లను పూర్తి చేసింది. ప్రభుత్వ అభ్యర్థన మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 7 కార్పొరేషన్లు, 116 మున్సిపాల్టీలు, 2,996 వార్డులకు రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహిం చేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది.మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాల పరిధిలోని జోనల్ ఆఫీసర్లు, ప్రిసైడింగ్ ఆఫీసర్లు(ఆర్వోలు) అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు (ఏఆర్వోలు), కౌంటింగ్ సిబ్బందికి బుధవారం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఏసీ గార్డ్స్‌లో గల సీడీఎంఏ కార్యాలయంలో టీవోటీలు శిక్షణ ఇస్తారు. వీరికి ఈ నెల 19న ఎంవోటీలు (మాస్టర్స్ ఆఫ్ ట్రైనర్స్) శిక్షణ నిర్వహించిన విషయం విదితమే.రాష్ట్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సూత్రప్రాయంగా అంగీకరించింది. యూఏఈ ఆర్థికమంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మార్రీతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. ఏపీ-యూఏఈ మధ్య ఆర్థిక భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంపై ఇద్దరూ చర్చించారు. యూఏఈకి చెందిన దాదాపు 40 సంస్థలు రాష్ట్రంలో తమ వాణిజ్యాన్ని నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ఆహార భద్రత, లాజిస్టిక్, పోర్టు ఆధారిత పరిశ్రమలు, పునరుత్పాదక విద్యుత్తు, పర్యాటకం, మౌలిక వసతుల కల్పన రంగాల్లో పెట్టుబడుల అవకాశాలపై చర్చించారు. యూఏఈకి చెందిన షరీఫ్ గ్రూప్ ఏపీలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ ఏర్పాటు చేసే ప్రతిపాదనలపైనా చర్చలు జరిగాయి. లైట్ గేజ్ స్టీల్ ఫ్రేమింగ్ సాంకేతికతతో అమరావతిలో ఆధునిక నిర్మాణ యూనిట్, డీపీ వరల్డ్‌తో కలసి రాష్ట్రంలో భారీ పోర్టు టెర్మినల్, లాజిస్టిక్స్, మౌలిక వసతుల అభివృద్ధి, ఏడీఎన్ఓసీ సంస్థ ద్వారా ఫ్లోటింగ్ స్టోరేజీ, విశాఖలో లులూ గ్రూప్ మెగా షాపింగ్ మాల్ నిర్మాణంపైనా చర్చించారు.

# అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

(మొదటి పేజీ తరువాయి)
చర్చ జరిగింది. భారతదేశం ఇప్పుడు ఉత్పత్తి రంగం వైపు చూస్తోందని, దానిని అందిపుచ్చుకునే దిశగా ఈ సరికొత్త విధానం తెచ్చామని చంద్రబాబు అన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా పారిశ్రామికవేత్తలు కావాలనుకునేవారికి మార్గనిర్దేశం చేస్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధికి మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చెప్పారు. ఎంఎ స్ఎంఈలను ప్రోత్సహించడం ద్వారా లోకల్ బ్రాండ్లకు మద్దతుగా ఉంటున్నామని చెప్పారు. గతేడాది మహిళా దినోత్సవం నాడు లక్ష మంది మహిళా పారిశ్రామికవేత్తలను చేస్తామని ప్రకటించామని, విడతల వారీగా మహిళలను పారిశ్రామికవేత్తలుగా చేస్తామని చెప్పారు.
"నైపుణ్యం ఉన్న మానవ వనరులను కంపెనీలకు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇలా చేయగలిగితేనే రాష్ట్రాభివృద్ధితో పాటు ప్రజలు కూడా అభివృద్ధి సాధిస్తారు. ఎన్నో రంగాల్లో అభివృద్ధి జరుగుతోంది పారిశ్రామికవేత్తలుగా ఎదిగాక ఉత్పత్తులను తయారు చేయడంతో పాటు బ్రాండింగ్‌నూ మార్కెట్ చేయడం అత్యవసరం. డ్వాక్రా మహిళల ఉత్పత్తులకూ బ్రాండింగ్ కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం" అని సీఎం అన్నారు.

# ధాన్యం కొన్న వెంటనే నగదు జమ

(మొదటి పేజీ తరువాయి)
కావాలని.. రైతు సేవా కేంద్రాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించేలా శిక్షణ ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఖరీఫ్‌లో ఇప్పటి వరకు 6,83,623 మంది రైతుల నుంచి రూ.9,890 కోట్ల విలువైన 41.69 లక్షల టన్నుల ధాన్యం సేకరించామని.. అందులో రూ.9,800 కోట్లు 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమ చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. విజయవాడలోని పౌరసరఫరాలశాఖ కమిషనరేట్‌లో ధాన్యం కొనుగోలుపై అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుపతి, నెల్లూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఖరీఫ్ ధాన్యం సేకరణ కొనసాగుతుందని ఆయన వివరించారు. 'రైతులు ఇబ్బంది పడకుండా తొలిసారిగా ప్రత్యేక రైలు ఏర్పాటు చేసి కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి ధాన్యం తరలిస్తున్నాం. తేమ శాతం, జీపీఎస్, రవాణా సమస్యలు సమర్థంగా అధిగమించాం' అని మనోహర్ పేర్కొన్నారు. రబీలోనూ గోతాలు, రవాణా, నిల్వ సౌకర్యాల్లోనూ ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ వీసీ, ఎండీ ఢిల్లీరావు, అధికారులు పాల్గొన్నారు.

# సిట్ ఎదుట 7 గంటలు

(మొదటి పేజీ తరువాయి)
రివర్స్ ప్రశ్నలు వేసినట్టు తెలుస్తోంది. ఒకవైపు హరీశ్‌రావును ప్రశ్నించే ప్రక్రియ జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయంలో కొనసాగుతుండగా.. వెలుపల భారీ సంఖ్యలో బీఆర్ఎస్ శ్రేణులు హరీశ్‌రావుకు మద్దతుగా చేసిన నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. కార్యాల యం వైపు దూసుకొస్తున్న కార్యకర్తలను సాయుధ పోలీసులు పలుమార్లు వెనక్కి నెట్టేయడం, వినకు ండా తోసుకు వచ్చినవారిని అరెస్ట్ చేసి అక్కడి నుంచి తరలించడం వంటి చర్యలు పలుమార్లు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో అందరి దృష్టినీ ఆకర్షించిన హరీశ్‌రావు విచారణ అంకం వివరాల్లోకి వెళ్తే.. ఫోన్‌ట్యాపింగ్ కేసులో సిట్ ఇచ్చిన నోటీసు మేరకు హరీశ్‌రావు.. ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అనుచరులు వెంట రాగా మొదట బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ కొద్దిసేపు కార్యకర్తలు, నాయకులతో మాట్లాడిన హరీశ్‌రావు తిరిగి జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి ఉదయం 11 గంటల ప్రాంతంలో చేరుకున్నారు. వెలుపల వేచి ఉన్న మీడియా ప్రతినిధులకు అభివాదాలు తెలుపుతూ రాజకీయ కక్షతోనే సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకే సిట్ అధికారులు తనను పిలిచారనీ, ఇదంతా ఒక డ్రామా అంటూ ఏసీపీ కార్యాలయంలోకి వెళ్లారు. లోపల హరీశ్‌రావు కోసం వేచి ఉన్న సిట్ అధికారులు నగర స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్ విజరు కుమార్, మహేశ్వరం డీసీపీ నారాయణ్‌రెడ్డి, గ్రేహౌండ్స్ ఆపరేషన్స్ కమాండెంట్ రవీందర్, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి విచారణను ప్రారంభించారు.
హరీశ్‌రావును మొదట ఎందుకు పిలిపించినట్టో కారణాలు తెలిపిన అధికారులు.. అనంతరం ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో ఇప్పటి వరకు తాము విచారించిన అధికారులు మీ పేరునే చాలా సందర్భాల్లో బయటపెట్టారు. ఇందులో మీ పాత్ర ఎంత అని ప్రశ్నించగా.. అందుకు మీ వద్ద ఉన్న ఆధారాలు ఏంటనీ హరీశ్‌రావు ఎదురు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు, ఓ ప్రయివేటు న్యూస్ ఛానెల్ సీఈఓ శ్రవణ్‌రావులు చాలా సార్లు మీరిచ్చిన ఆదేశాలు, పంపిన ఫోన్ నెంబర్లు, తెలిపిన పేర్ల ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ జరిపి, సమాచారాన్ని మీకు పంపినట్టు తెలిపారని సిట్ అధికారులు తెలపగా .. తాను హొం మంత్రిని కాదనీ, తనకు ఈ విషయంతో సంబంధం లేదని హరీశ్‌రావు సమాధానం ఇచ్చినట్టు సమాచారం. శ్రవణ్‌రావు ఫోన్‌ట్యాపింగ్‌కు సంబంధించి సేకరించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరికరాలను ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలోని భవనంలో అమర్చి ట్యాపింగ్ వ్యవహారాన్ని జరపడం వెనక మీ హస్తం ఉందంట కదా అనే ప్రశ్నకుడ అనేక మంది అనేక విషయాలు చెప్తుంటారు, వాటన్నిటినీ నమ్మేస్తామా అంటూ హరీశ్‌రావు సమాధానమిచ్చినట్టు తెలుస్తోంది. ప్రశ్నల పరంపరను అధికారులు కొనసాగించగా.. నాకు సంబంధం లేనివి, నేను తలదూర్చని, నాకు తెలియని ప్రశ్నలు వేస్తే ఎలా అంటూ హరీశ్‌రావు ఎదురు ప్రశ్నించినట్టు సమాచారం. శ్రవణ్‌రావు, ప్రభాకర్‌రావుతో పాటు తాము ఇది వరకు అరెస్ట్ చేసి ప్రశ్నించిన అధికారులతో హరీశ్‌రావు పలుమార్లు మాట్లాడిన ఆధారాలు తమ దగ్గర ఉన్నాయనీ, ముఖ్యంగా 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంతో పాటు అంతకముందు జరిగిన ఉప ఎన్నికల సందర్భంలో సదరు అధికారులతో పలుమార్లు మాట్లాడిన ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని సిట్ అధికారులు సూటిగా ప్రశ్నించగాడ కొన్ని సందర్భాల్లో మాట్లాడుతూ ఉంటాం, అంత మాత్రానా తప్పు చేసినట్టా అని కూడా హరీశ్‌రావు అధికారులకు చెప్పినట్టు తెలిసింది. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో అప్పటి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్‌లను ఎందుకు మీరు ప్రశ్నించరని కూడా హరీశ్‌రావు సిట్ అధికారులను నిలదీసినట్టు సమాచారం.

# చలాన్ల వసూళ్ల కోసం వేధించవద్దు

(మొదటి పేజీ తరువాయి)
వాహనాల తాళాలు లాక్కోవడం, సీజ్ చేయడం సరికాదంది. స్వచ్ఛందంగా చెల్లిస్తేనే చలాన్లు వసూలు చేయాలని, లేకపోతే నోటీసులు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. కాగా.. గత సంవత్సరం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి రూ.239.37 కోట్ల చలాన్లు విధించారు. ఇందులో వాహనాలను ఆపి ట్రాఫిక్ పోలీసులు విధించిన చలాన్లు 10,27,335 ఉండగా, ఈ-చలాన్లు 25,93,152 ఉన్నాయి. ఈ రెండు రకాల చలాన్ల మొత్తం విలువ రూ. 239.37 కోట్లు అని వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది. కొద్దిరోజుల క్రితం యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా అరైవ్-అలైవ్ పేరుతో ప్రచార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులకు పోలీసులు చలానాలు వేయగానే.. వారి బ్యాంకు ఖాతా నుంచి ఆ మొత్తం ఆటోమెటిక్‌గా చెల్లింపు జరిగిపోయేలా సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరముందని చెప్పారు.

# తదుపరి దర్యాప్తు అవసరమా ?

(మొదటి పేజీ తరువాయి)
విచారించాలనుకుంటున్నారో, ఏయే అంశాలపై మరింత విచారణ అవసరమో వివరంగా తెలపాలని ధర్మాసనం ఆదేశించింది. అనంతరం కేసు విచారణను ఫిబ్రవరి 5కి వాయిదా వేసింది.
వివేకా హత్య కేసులో తదుపరి దర్యాప్తుపై ట్రయల్ కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఆయన కుమార్తె సునీతా రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈరోజు విచారణ చేపట్టింది. సునీత తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు సూచనల మేరకు ట్రయల్ కోర్టును ఆశ్రయించినప్పటికీ, తమ పిటిషన్‌లో ప్రస్తావించిన కీలక అంశాలను పూర్తిగా పరిగణలోకి తీసుకోలేదని ఆయన తెలిపారు. పిటిషన్‌లో లేని అంశాల ఆధారంగా పరిమిత స్థాయిలో మాత్రమే పాక్షిక దర్యాప్తుకు అనుమతిచ్చారని, ఇది న్యాయసమ్మతం కాదని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ, కేసులో ఇంకా దర్యాప్తు అవసరమా అనే విషయంపై సీబీఐ స్పష్టత ఇవ్వాలని కోరింది. దీనిపై సీబీఐ తరఫు న్యాయవాది స్పందిస్తూ, దర్యాప్తు అధికారితో చర్చించి పూర్తి వివరాలు సమర్పించేందుకు రెండు వారాల గడువు కావాలని తెలిపారు. దీంతో తదుపరి విచారణను ఫిబ్రవరి 5కు సుప్రీంకోర్టు వాయిదా వేసింది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం 21 జనవరి 2026

# సురక్షితంగా గమ్యం చేరాలంటే రోడ్డు భద్రతే ప్రధాన లక్ష్యం..

## నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ..








**ప్రజావినికిడి,(నాగోల్):**
రోడ్డు నియమ నిబంధనలను పాటిస్తూ,మానసిక ఆందోళనలకు దూరంగా ఏకాగ్రతతో వాహనాలు నడిపినప్పుడే ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యస్థానాన్ని చేరగలుగుతారని నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ అన్నారు.
ఈ నెల1వ తేదీ నుంచి డిసెంబర్ 31వరకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా మంగళవారం నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో రోడ్డు భద్రత,ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాగోల్ పోలీసు సిబ్బంది,బండ్లగూడ టీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ, నాగోల్ రవాణా శాఖ అధికారి అభిలాష్, వైద్యులు అదేవిధంగా స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ మాట్లాడుతూ, గతంలో ప్రజలు వివిధ వ్యాధుల వల్ల మృతి చెందేవారని,అయితే ప్రస్తుతం అత్యధికంగా రోడ్డు ప్రమాదాలే ప్రాణాలు తీసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ పెద్దలు,యువత, విద్యార్థులు మరణించడంతో ఎన్నో కుటుంబాలు శోకసముద్రంలో మునిగిపోతున్నాయని అన్నారు.ప్రధానంగా వాహనం నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం వల్లే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.క్షణిక నిర్లక్ష్యం జీవితకాల విషాదంగా మారుతుందని హెచ్చరించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ వినియోగించాలని సూచించారు.మద్యం సేవించి వాహనం నడపడం,లైసెన్స్ లేని మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు.ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రమాదాలకు డ్రైవింగ్ సమయంలో మొబైల్ వాడటమే కారణమని వివరించారు.తమ కుటుంబాల్లోనూ ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా పిల్లలు, బంధువులు, స్నేహితులకు రోడ్డు భద్రత నియమాలు తెలియజేసి అవగాహన కల్పించాలని సీఐ ప్రజలకు పిలుపునిచ్చారు.బండ్లగూడ టీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ రామకృష్ణ మాట్లాడుతూ,తమ సంస్థలో డ్రైవర్లు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనుకాకుండా తరచూ వైద్య పరీక్షలు నిర్వహిస్తూ భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై మరింత అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

# చట్టం దినపత్రిక నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన డీసీపీ శిరీష

## ప్రజలకు చట్టాలపై మరింత అవగాహన కల్పించాలి.ఏసిపి లక్ష్మీనారాయణ

## నిర్భయ జర్నలిజానికి ప్రతీక చట్టం దినపత్రిక సేవలు అభినందనీయం. పట్టణ సిఐ విజయ్ కుమార్




**ప్రజావినికిడి,(షాద్ నగర్):**పట్టణ కేంద్రంలోని నియోజకవర్గ ఇన్‌చార్జ్ రిపోర్టర్ దిర్శిణం శంకర్ ఆధ్వర్యంలో సంస్థ రూపొందించిన చట్టం దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను షాద్‌నగర్ ఫ్యూచర్ జోన్ డీసీపీ శిరీష, ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ విజయ్ కుమార్‌లు ఘనంగా ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా డీసీపీ శిరీష మాట్లాడుతూ,ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించడంలో చట్టం దినపత్రిక కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.సమాజంలో న్యాయం,భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు సత్యనిష్ఠమైన సమాచారం అందిస్తూ చట్టబద్ధమైన సమాజ నిర్మాణానికి తోడ్పడుతున్నందుకు చట్టం దినపత్రిక యాజమాన్యాన్ని అభినందించారు.ఏసీపీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ,పోలీస్ శాఖతో మీడియా సమన్వయం ఉంటేనే ప్రజల్లో చట్టంపై నమ్మకం మరింత పెరుగుతుందన్నారు. ప్రజలకు ఉపయోగపడేవార్తలు, అవగాహనాత్మక కథనాలతో చట్టం దినపత్రిక ముందుకు సాగాలని ఆకాంక్షించారు.పట్టణ సీఐ విజయ్ కుమార్ మాట్లాడుతూ,నిజాయితీగల జర్నలిజమే సమాజానికి దిశానిర్దేశం చేస్తుందని అన్నారు.ప్రజా సమస్యలను బాధ్యతాయుతంగా వెలుగులోకి తెస్తూ చట్ట పరిరక్షణకు తోడ్పడుతున్న చట్టం దినపత్రిక సేవలు అభినందనీయమన్నారు.నూతన సంవత్సరంలో చట్టం దినపత్రిక మరింత ప్రగతిపథంలో సాగాలని అందరూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో చట్టం దినపత్రిక ప్రతినిధులు,స్థానిక ప్రజాప్రతినిధులు,పట్టణ ప్రముఖులు,జర్నలిస్టులు మల్చలం రమేష్,వానరాశి జగన్,పాల్గొన్నారు

# పచ్చని పొలాల్లో చిచ్చు రేపుతున్న క్రషర్

## పర్యావరణానికి పెనుముప్పు...

**నిబంధనలు తుంగలో తొక్కుతున్న క్రషర్ నిర్వాహకులు**

**హేమ మైక్రో ప్రైవేట్ లిమిటెడ్ స్టోన్ క్రషర్ పరిశ్రమ తీరుపై ప్రజలు మండి పాటు**

**పరిశ్రమ రైతన్నల జీవనానికి శాపంగా మారింది.**

**మీ స్వలభల కోసం మమల్ని బలి చేస్తే ఎలా.?**

**తక్షణమే చర్యలు తీసుకోవాలని రైతన్నలు డిమాండ్.**



**ప్రజావినికిడి, (జడ్చర్ల):**
మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలోని బాలనగర్ మండలం పెద్దరేవల్లి గ్రామం సమీపంలో ఏర్పాటు చేసిన శ్రీ హేమ మైక్రో ప్రైవేట్ లిమిటెడ్ స్టోన్ క్రషర్ పరిశ్రమ గ్రామస్తులు, రైతులకు తీరని శాపంగా మారింది.గ్రామ ముఖద్వారంలో వెలసిన శ్రీ తిరుమలనాథ స్వామి గుట్టకు అతి సమీపంలో ఈ క్రషర్ ఏర్పాటు కావడంతో పర్యావరణం పూర్తిగా విధ్వంసం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.క్రషర్ నుంచి వెలువడుతున్న దట్టమైన స్టోన్ పౌడర్, ధూళి కారణంగా పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు పూర్తిగా తెల్లగా మారుతున్నాయి. రెండు కిలోమీటర్ల పరిధిలో ఏ పంట వేసినా చేతికొచ్చే పరిస్థితి లేదని, తీవ్రంగా నష్ట పోతున్నామని రైతులు వాపోతున్నారు.వరి, కూరగాయలు, పప్పుదినుసుల పంటలు పూర్తిగా దెబ్బతిని దిగుబడి శూన్యానికి చేరుతోందని చెబుతున్నారు.ఇక గ్రామ ఆరాధ్య దైవమైన శ్రీ తిరుమలనాథ స్వామి గుట్ట కూడా ఈ ధూళి దాడికి గురవుతోంది. గుట్ట మొత్తం స్టోన్ పౌడర్‌తో కప్పబడుతూ,అక్కడ నివసిస్తున్న అనేక వన్యప్రాణులు,పక్షులు తమ ఆవాసాలను వదిలి వలస వెళ్లే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు తెలిపారు. కొందరు వన్యప్రాణులు మృతి చెందిన ఘటనలూ చోటు చేసుకున్నాయని వారు ఆరోపిస్తున్నారు.క్రషర్ నుంచి వెలువడుతున్న దుమ్ము కారణంగా గ్రామంలో శ్వాసకోశ వ్యాధులు,కళ్ల మంటలు,చర్మ సమస్యలు పెరుగుతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని చెప్పారు.పాడి రైతుల గేదెలు, ఆవులు కూడా అనారోగ్యానికి గురవుతున్నాయని, పాల ఉత్పత్తి తగ్గిపోయిందని తెలిపారు.గ్రామస్తుల ఆరోపణల ప్రకారం..ఈ క్రషర్ నిర్వాహకులు పర్యావరణ అనుమతులను తుంగలో తొక్కుతూ నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమను నడుపుతున్నారు.డస్ట్ కంట్రోల్ వ్యవస్థలు సరిగా అమలు చేయకపోవడం, నీటి పిచికారీ చేయకపోవడం వల్ల పరిస్థితి మరింత దారుణంగా మారిందని వారు వాపోతున్నారు.ఇది ఇలానే కొనసాగితే మా భవిష్యత్తే అంధకారమే మారుతుందని తమ గోడును వెళ్లబోసుకున్నారు.పంటలు పండే సూచనలు లేవు,ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుందని, దేవుడి గుట్టకే ముప్పు వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ పరిశ్రమపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, క్రషర్‌ను మూసివేయాలని లేదా గ్రామానికి దూరంగా తరలించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.మైనింగ్ శాఖ,కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు



# షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల బరిలో 20వ నుండి బిజెపి అభ్యర్థి గా అందేలా సందీప్ యాదవ్



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**కరోనా సమయం లో షాద్ నగర్ పట్టణ ప్రజలకు ఎన్నో సేవలు చేసిన మంచిపేరు సందీప్ యాదవ్ కి ఉంది.అదేవిధంగా 20వ వార్డు సమస్య ల పైన స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం లో తనగళం వినిపించి పటేల్ రోడ్ నిర్మాణానికి ఒత్తిడి చేసి సాధించిన ఘనత సందీప్ యాదవ్ కు ఉంది.లాక్ డౌన్ సమయంలో 15రోజుల పాటు తన సొంత నిధులతో నిరుపేదలకు ఆకలి తీర్చిన ప్రజల ఆశీర్వాదలు పొందాడు ప్రజాశేత్రం లో నిత్యం ప్రజల సమస్యలు పైన కొట్లాడే తత్త్వం ఉన్నా సందీప్ యదవ్ రాష్టం లోనే అత్యున్నత వార్డ్ గా 20వ వార్డును తీర్చిదిద్దాలనే లక్ష్యం తో ఎన్నికల భరిలో నిలవనున్న సందీప్ యదవ్,20వ వార్డులోని ప్రజలు ఆశీస్సులు ఉండి నన్ను గెలిపిస్తారని దీమతో ముందుకు సాగుతున్నాను.

# షాద్ నగర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేద్దాం

## ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**పట్టణంలో వి కన్వెన్షన్ హాల్ లో షాద్ నగర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల సన్నాహక కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, ఈ కార్యక్రమంలో కార్యకర్తలకు మున్సిపల్ ఎన్నికలపై దిశ నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, రానున్న షాద్ నగర్ మున్సిపల్ ఎన్నికల్లో 28 వార్డులను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుని షాద్ నగర్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, మున్సిపాలిటీ గెలుపు కార్యకర్తలదేనని,ప్రతి ఒక్కరూ పాత కొత్త అని తేడా లేకుండా సమన్వయంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలన్నారు.పార్టీ కార్యకర్తలే కాంగ్రెస్ బలమని,క్రమశిక్షణతో ముందుకు సాగాలని,పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి.మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుంధర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ బాబర్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూర్ విశ్వం,గిరిజన ఆదివాసీ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్,మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి,కొత్తూర్ మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్,నేతలు చెంది తిరుపతి రెడ్డి, అగ్గనూర్ బస్వశీ,కాశినాద్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకట రాం రెడ్డి,జ్బుమద్ ఖాన్,అందే మోహన్ ముదిరాజ్,పట్టణ నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.ద

# కర్రెగుట్టలపై బేస్ క్యాంపు ఏర్పాటు చేసిన సీఆర్పీఎఫ్

## మావోయిస్టులను చెక్ పెట్టే లక్ష్యంతో భద్రతా బలోపేతం







**వాజేడు జనవరి 21 (ప్రజావినికిడి):** మురుమూరు గ్రామపంచాయతీ పరిదిలో తెలంగాణ-ఛత్తీస్గఢ్ సరిహద్దులో ఉన్న కర్రెగుట్టలపై మంగళవారం కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ఆధ్వర్యంలో బేస్ క్యాంపు ఏర్పాటు చేయగా సిఆర్పిఎఫ్ దక్షిణ విభాగం ఐజి టి విక్రమ్ ప్రారంభిం చారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో మురుమూరు నుంచి పామునూరు గుట్టల వరకు రహదారి నిర్మాణం చేపట్టి,20 కుటుంబాలకు పైగా నివసిస్తున్న పామునూరు గ్రామ సమీపంలో క్యాంపు నెలకొల్పారు. మావోయిస్టులు రక్షిత ప్రాంతంగా భావిస్తూ తలదాచుకునే కర్రెగుట్టలలో వారి కార్యకలాపాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు ఈ క్యాంప్ ఉపయో గపడుతుందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా పామునూరు గిరిజనులకు దుస్తులు, దుప్పట్లు,నిత్యావసర వస్తువులను పంపిణీ చేయ గా క్యాంప్ ప్రారంభం నేపథ్యంలో ప్రాంతంలో భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రేంజ్ డీఐజీ ఎస్టేచ్.అనిల్ మింజ్,39, బెలాటియన్ కమాండెంట్ ప్రశాంత్ శ్రీ వాత్సవ,ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీఎఫ్వో రాహుల్ కిషన్ జాదవ్,ఏఎస్పీ మనన్ భట్,89 బెటాలియన్ కమాండెంట్ ముఖేష్, తదితరులు పాల్గొన్నారు.

# స్కూల్లో హౌస్ సిస్టం స్టూడెంట్ కౌన్సిలింగ్ కార్యక్రమం




**వాజేడు జనవరి 21 (ప్రజావినికిడి):**ఉమ్మడిదొడ్డి ఎంపీ యుపిఎస్ పాఠశాల యందు విద్యార్థులతో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు పాఠశాల విద్యాశాఖ వారి ఆదేశానుసారం హౌసు సిస్టం అలాగే స్టూడెంట్ కౌన్సిలింగ్ స్థానిక మండల విద్యాశాఖ అధికారి ఎం వెకటేశ్వరరావు ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ,ఈ హౌస్ సిస్టం విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు అలవడుతాయని అలాగే పాఠశాలలో జరిగే ఉదయం ప్రార్థన మధ్యాహ్నం భోజన పథకం అమలు పర్యవేక్షణ వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహనకలిగించడం తల్లిదండ్రుల సమావేశాలకు హాజరయ్యేందుకు ప్రోత్సహించడం వంటి బాధ్యతలను నిర్వర్తించాలని అలాగే హౌస్ ల మధ్య క్రీడలు సాంస్కృతిక పోటీలు నిర్వహించడం పాఠశాల కార్యక్రమాలకు ప్రచారాలకు నాయకత్వం వహించడం వంటి బాధ్యతలు వివిధ కమిటీలు సక్రమంగా క్రీడా పోటీల ప్రారంభోత్సవం జరిగింది జనవరి 26 రిపబ్లిక్ డే ని పురస్కరించుకొని పాఠశాల యందు విద్యార్థులకు వివిధ క్రీడాంశాలలో క్రీడా పోటీలను ఎంఈఓ ఏఏపి కమిటీ చైర్మన్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బి.గిరిప్రసాద్ టీచర్స్ నాగార్జున రాజు స్కూల్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రెండేళ్ల పరిపాలనలో ఏం అభివృద్ధి చేసింది

## ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్




**ప్రజావినికిడి,(అంబర్ పేట్):** కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పరిపాలనలో ఏం అభివృద్ధి చేసిందని అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఎద్దేవ చేశారు.జిహెచ్ఎంసీ, తెలంగాణ నారెడ్కో ఆధ్వర్యంలో అంబర్పేట్ నియోజకవర్గానికి చెందిన జిహెచ్ఎంసీ ఫీల్డ్ సిబ్బందికి శీతాకాల స్వేటర్ల పంపిణీ కార్యక్రమం అంబర్పేట్ జిహెచ్ ఎంసి గ్రౌండ్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగాఅంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ హాజరై,కార్పొరేటర్ పద్మ వెంకట్ రెడ్డి,కార్పొరేటర్ విజయ్ కుమార్ గౌడ్,కార్పొరేటర్ వై. అమృత,కార్పొరేటర్ కన్నా ఉమా రమేష్ యాదవ్ లతో కలిసి స్వేటర్లను పంపిణీ చేశారు.కార్యక్రమంలోజిహెచ్ఎంసీ అదనపు కమిషనర్ రఘు ప్రసాద్,డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్,
నారెడ్కో అధ్యక్షులు విజయ్ సాయి మేఘ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాట్లాడుతూ,ప్రతి వాతావరణ పరిస్థితుల్లోనూ ప్రజల ఆరోగ్యం,పరిశుభ్రత కోసం అంకితభావంతో పనిచేస్తున్న జిహెచ్ఎంసీ ఫీల్డ్ సిబ్బంది సేవలు అభినందనీయమని కొనియాడారు.వారి సంక్షేమమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.జిహెచ్ఎంసిలో పనిచేసే పారిశుద్ధ కార్మికులకు పండుగ, ఆదివారం వేళలో డ్యూటీ సమయాన్ని తగ్గించి వారికి చేయూతనివ్వాలని అధికారులను కోరారు. నియోజకవర్గంలో పారిశుద్ధ్య కార్మికులకే కాకుండా ఇక్కడ నివసించే ప్రాంత వాసులకు డబుల్ బెడ్ రూమ్ కొరకు 70 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయిస్తే అందరికీ డబుల్ బెడ్ రూమ్ లను నిర్మించి ఇస్తామని అన్నారు. అంతేకాకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో జిహెచ్ఎంసి కార్మికులకు మూడుసార్లు జీతాలు పెరిగాయని గుర్తు చేశారు.నేటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండేళ్లు గడిచిన కూడా ఒక్కసారి కూడా జీతాలు పెంచిన దాఖలాలు లేవని తేల్చి చెప్పారు.



రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నాము అని చెప్పడమే తప్ప ఇప్పటివరకు చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు.జిహెచ్ఎంసి ఎన్నికలలో ఈ సారి ఎక్కువగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆకాంక్షించారు. రాబోయే స్థానిక ఎన్నికలలో మరో మారు బిఆర్ఎస్ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# శ్రీనగర్ కాలనీలో రెండు రోడ్లకు శంకుస్థాపన.



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డ్ శ్రీనగర్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా రెండు సిమెంట్ రోడ్ల నిర్మాణానికి మంగళవారం శంకుస్థాపన జరిగింది. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య ఆధ్వర్యంలో గన్నోజు యాదగిరి ఇంటి నుండి గన్నోజు రాజలింగం ఇంటి వరకు,అలాగే శ్యాంసుందర్ ఇంటి నుండి ఖలీమ్ ఇంటి వరకు రోడ్ల పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా కొంకళ్ల చెన్నయ్య మాట్లాడుతూ,షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ప్రజల అభివృద్ధికే ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక వార్డుల్లో గెలిపించి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి,శ్రీనగర్ కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు జమాల్ పూర్ చందూలాల్, బుచ్చిరెడ్డి,ఓం ప్రకాష్,షాద్ నగర్ నియోజకవర్గ బీసీ జనసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర అప్ప, తంగడపల్లి శంకర్,చౌలపల్లి విష్ణువర్ధన్ రెడ్డి,మార్కాపురం రవి, శ్రీనివాస్,మార్కాపురం మురళి,వేణు, యాదయ్య,మేకల వెంకటేష్,నవీన్ రెడ్డి, శ్యాంసుందర్,జమాల్ పూర్ శివాజీ,జనార్దన్ గౌడ్,మహేష్‌తో పాటు మహిళలు,కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా శ్రీ నితిన్ నబీన్ జీ ఎన్నిక



**ప్రజావినికిడి,(షాద్ నగర్):** భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడిగా శ్రీ నితిన్ నబీన్ జీ ఎన్నిక కావడం దేశ రాజకీయాల్లో నిర్ణయాత్మక మలుపుగా బీజేపీ సీనియర్ నాయకుడు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి అభివర్ణించారు.ఈ సందర్భంగా ఆయన శ్రీ నితిన్ నబీన్ జీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.శక్తివంతమైన సంస్థాగత పునర్నిర్మాణం, క్రమశిక్షణ గల కార్యకర్తల శక్తి, స్పష్టమైన జాతీయ దృష్టికోణంతో బీజేపీని మరింత దూకుడుగా ముందుకు నడిపించే సామర్థ్యం శ్రీ నితిన్ నబీన్ జీకి ఉందని నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి పేర్కొన్నారు.ఇప్పటివరకు బీజేపీ అధికారంలోకి రాని రాష్ట్రాల్లో కూడా పార్టీ జెండాను ఎగరవేసే స్థాయికి బీజేపీ చేరుతుందని,ప్రాంతీయత,కుటుంబ పాలన,అవినీతి రాజకీయాలకు గట్టి ప్రత్యామ్నాయంగా బీజేపీ మరింత బలంగా ఎదుగుతుందని స్పష్టం చేశారు.దేశ సమగ్రత,జాతీయ భద్రత,అభివృద్ధి,సాంస్కృతిక పునరుజ్జీవనం అనే లక్ష్యాలతో బీజేపీ విజయపథంలో ముందుకు దూసుకెళ్లడం ఖాయమని,ఈ ప్రయాణానికి శ్రీ నితిన్ నబీన్ జీ నాయకత్వం కీలకంగా నిలుస్తుందని నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి తెలిపారు.

# రుక్మిణి సత్యభామ వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి,అందే బాబయ్య లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బిజెపి నేతలు పాల్గొనగా గ్రామ సర్పంచ్ కుర్వ లలిత మల్లేష్ అతిథులకు ఘన స్వాగతం పలికి ఆలయ ప్రాంగణంలోకి ఆహ్వానించారు. ఆలయ పూజారులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి తో పాటు అతిథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.
ఈ సందర్భంగా నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ,దేవునిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం ఎంతో పురాతనమైనదని, భక్తుల మనోభావాలకు,గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ఇది కేంద్రబిందువుగా నిలుస్తోందని అన్నారు. ఇలాంటి చారిత్రక దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వాలు అన్ని విధాలుగా సహకరించాలని తెలిపారు. వేణుగోపాల స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,గ్రామం సుభిక్షంగా ఉండాలని, సకల సర్వ విజయాలు ప్రాప్తి కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని దేవుడిని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.అందే బాబయ్య మాట్లాడుతూ, దేవునిపల్లి వేణుగోపాల స్వామి దేవాలయం చారిత్రక ప్రాధాన్యం కలిగినదని, ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలు, కళ్యాణ మహోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయని అన్నారు. భవిష్యత్తులో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పాలక వర్గం సభ్యులు,గ్రామ పెద్దలు, నాయకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# హరీష్ రావు పై కాంగ్రెస్ పెట్టే అక్రమ కేసులకు భయపడేది లేదు

## ఉమ్మడి పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**ప్రజావినికిడి,(నందిగామ):** కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలను ప్రశ్నిస్తున్నందుకు వారి వైఫల్యాలను బయటపెడుతున్నందుకు హరీష్ రావుపై కక్షకట్టి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హరీష్ రావుని ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణకు రావాలని పోలీసుల చేత నోటీసులు జారీ చేయడం అభ్యంతరకరమని,దేశ అత్యున్నత న్యాయస్థానం క్లీన్ చిట్ ఇస్తూ తీర్పు ఇచ్చిందని అది మరిచిపోయి మళ్ళీ పోలీసుల చేత నోటీసులు ఇచ్చి విచారణకు హాజరు కావాలనడం మూర్ఖత్వమని,కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టె అక్రమ కేసులకు బీఆర్ఎస్ భయపడదని ప్రభుత్వాని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి హెచ్చరించారు.

# యాదాద్రీశుడి సేవలో కోమటిరెడ్డి



యాదగిరిగుట్ట,**జనవరి 20ప్రజావినికిడి** యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మంగళవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు లడ్డు ప్రసాదంతోపాటు వేదాశీర్వచనాన్ని అందజేశారు. మంత్రి వెంట జిల్లా కలెక్టర్ హనుమంతరావు, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, అధికారులు ఉన్నారు.

# కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి,ఎంపీపీ శివశంకర్ గౌడ్ తదితరులు







**ప్రజావినికిడి,(షాద్ నగర్):** రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండల పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రంగాల సంస్థల చైర్మన్, షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ దర్శించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి,ఉమ్మడి కొత్తూరు మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్,పార్టీ సీనియర్ నేతలు కాశీనాథ్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి,బాలరాజ్‌లు హాజరయ్యారు.గ్రామ సర్పంచ్ కుర్వ లలిత మల్లేష్ అతిథులకు ఘన స్వాగతం పలికి ఆలయ ప్రాంగణంలోకి ఆహ్వానించారు.
ఆలయ పూజారులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో పాటు అతిథులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ మాట్లాడుతూ,దేవునిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం ఎంతో పురాతనమైనదని, భక్తుల మనోభావాలకు, గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ఇది కేంద్రబిందువుగా నిలుస్తోందని అన్నారు. ఇలాంటి చారిత్రక దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరు చేయించి, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.వేణుగోపాల స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని,గ్రామం సుభిక్షంగా ఉండాలని, సకల సర్వ విజయాలు ప్రాప్తి కలగాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని దేవుడిని ప్రార్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు తెలిపారు.మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ,దేవునిపల్లి వేణుగోపాల స్వామి దేవాలయం చారిత్రక ప్రాధాన్యం కలిగినదని, ఇక్కడ నిర్వహించే బ్రహ్మోత్సవాలు, కళ్యాణ మహోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతాయని అన్నారు. భవిష్యత్తులో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పాలక వర్గం సభ్యులు,
గ్రామ పెద్దలు, నాయకులు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక



# షాద్ నగర్ పట్టణంలో బస్తీ దవాఖానను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**ప్రజావినికిడి,(షాద్ నగర్):**పట్టణంలోని కాలనీలోని 20వ వార్డు (పాత గంజి) లో బస్తీ దవాఖానాను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మంగళవారం రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి కే లలితాదేవి తో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ విజయలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్,డిపిఓ అక్రమ్,సీసీ సురేష్,డాక్టర్ స్రవంతి చించోడు,డాక్టర్ దామోదర్,ఏఎన్ఎం,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కే.శంకరయ్య మాట్లాడుతూ,ప్రభుత్వ ఆసుపత్రులనుప్రైవేటు దవాఖానాలకు దీటుగా తీర్చిదిద్ది అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తున్నామని సర్కారు దవాఖానాల్లో సదుపాయాలు కల్పించడంతో పాటు బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసి డాక్టర్లు, వైద్య సిబ్బందిని నియమించి పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందేలా చర్యలు తీసకుంటున్నట్లు తెలిపారు.మా ప్రభుత్వ ముఖ్యంగా వైద్యం,విద్య ఈ రెండిటికి మొదటి ప్రాధాన్యత ఇస్తుందని కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించుకొని అప్పుల పాలు అవుతున్నారని అందుకే పేద ప్రజలను దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రాంతాల్లో బస్తీ దవఖానాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. ముఖ్యంగా ఈ దవఖానాల్లో ప్రతి రోగానికి రక్త పరీక్షలతో పాటు అవసరమైన మందులు కూడా అందుబాటులో ఉంచడం జరిగిందని ఇక్కడున్న సిబ్బంది ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.అతి త్వరలో షాద్నగర్ పట్టణంలో ఏర్పాటు కాబోయే 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు.ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి లలిత దేవి మాట్లాడుతూ,

ఈ బస్తీ దవఖన సెంటర్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అన్ని రకాల సేవలు అందుబాటులో ఉంటాయని ఇందులో స్టాఫ్ నర్సులతో పాటు,అదనపు సిబ్బంది ఒక మెడికల్ ఆఫీసర్, అందుబాటులో ఉంటారని అందరికీ ఓపీ చూడబడతాయని అన్ని రకాల టెస్టులను తెలంగాణ దయాగ్నెటిక్స్ హబ్ కి పంపించడం జరుగుతుందని ఇందులో 134 పరీక్షలు అందుబాటులో ఉన్నాయని ఈ బస్సు దావఖానకు ప్రభుత్వ మెడికల్ వాహనం వచ్చి శాంపిల్స్ కలెక్ట్ చేసుకుని తెలంగాణ దయాగ్నోసిస్ సెంటర్ కు ఇవ్వడం జరుగుతుందని 24 గంటల్లో పేషంట్స్ వాట్సప్ కి రిపోర్ట్స్ యొక్క రిజల్ట్ను సమాచార రూపం అందివ్వడం జరుగుతుందని అలాగే ప్రతి సోమవారం గర్భిణులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించబడతాయని అలాగే ప్రతి మంగళవారం 15 సంవత్సరాల నుండి 65 సంవత్సరాల మహిళల వరకు అన్ని రకాల వైద్య సేవలు వీరికి అందించబడతాయని అలాగే బుధవారం శనివారం ఇమినేషన్ అనే ప్రత్యేక ప్రోగ్రాం ఉంటుందని గురువారం పెద్దవారికి ఓపి క్లీనింగ్ తో పాటు ప్రతివారం ఒక్కొక్క రోజు ఒక్కొక్క కార్యక్రమం తో పాటు బీపీ అలాగే షుగర్ ఉన్నవారికి ప్రతి నెల నెల మందులు ఇవ్వడం జరుగుతుందని అలాగే శుక్రవారం ప్రతి గర్భిణీ స్త్రీ కి పరీక్షలు నిర్వహించబడతాయని అన్నారు. శనివారం ఒక్కరోజే సెలవు దినంగా ప్రకటించడం జరిగింది.అయితే ఆదివారం కూడా ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొంకల చెన్నయ్య ముదిరాజ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్,షాద్ నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ విశ్వం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి,ఫరూక్నగర్ మండల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చల్ల శ్రీకాంత్ రెడ్డి,కాంగ్రెస్ సీనియర్ నాయకులు అగనూరి బస్వం,ముబారక్ అలీ,ఖాదర్ మొదలగువారు పాల్గొన్నారు.

# ఉగాది నుంచి గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్ అమలు

## రాష్ట్ర భూ భాగంలో 2047 నాటికి 50 శాతం గ్రీనరీ

**గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి వృక్షాలకు ప్రాధాన్యం**

**తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కల పెంపకం**

**నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు సన్నద్ధం కావాలి**

**అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధిపతులతో పవన్ కళ్యాణ్ సమీక్ష**



అమరావతి,**జనవరి 20ప్రజావినికిడి**

రాష్ట్రాన్ని 50 శాతం పచ్చదనంతో నింపే గ్రీన్ కవర్ ప్రాజెక్టులో అన్ని శాఖలు త్రికరణ శుద్ధిగా భాగస్వామ్యం తీసుకోవాలని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా అన్ని శాఖలు ఉగాదిలోపు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు. ఉగాది నుంచి గ్రీన్ కవర్ యాక్షన్ ప్లాన్ అమలు కావాలని ఆదేశించారు. పరిశ్రమల శాఖ.. కాలుష్యాన్ని నియంత్రించే మొక్కలు నాటేందుకు, తీర ప్రాంతాల్లో పెనుగాలులు, ఉప్పు నీటిని తట్టుకునే మొక్కల పెంపకానికి సిద్ధం కావాలని నిర్దేశం చేశారు. గ్రీన్ కవర్, గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టుల్లో స్వజాతి వృక్ష జాతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత వర్గాలకు సూచనలు చేశారు. మంగళవారం

వెలగపూడి లోని రాష్ట్ర సచివాలయంలో అటవీశాఖతో పాటు వివిధ శాఖల అధిపతులు, ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 50 శాతం గ్రీన్ కవర్ ప్రాజెక్టుపై చర్చించారు. ప్రాజెక్టు ప్రణాళికలు, నిధుల కేటాయింపు తదితర అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 50 శాతం పచ్చదనం పెంపు ప్రాజెక్టుకి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు.. రాష్ట్రం మొత్తం భూ భాగంలో 2047 నాటికి 50 శాతం పచ్చదనంతో నింపాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అందుకోసం 32.60 లక్షల ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉంది. ఈ లక్ష్యంలో భాగంగా 2030 నాటికి 37 శాతం పచ్చదనం నింపాల్సి ఉందన్నారు.. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో 30 శాతం గ్రీనరి ఉండగా.., వచ్చే నాలుగేళ్లలో మరో 7 శాతం గ్రీనరీ పెంచాల్సి ఉంది. అందుకోసం 9 లక్షల హెక్టార్లలో చెట్లను నాటాలని పిలుపునిచ్చారు.. ఈ యజ్ఞంలో అన్ని శాఖలు తమ వంతు భాగస్వామ్యం పోషించాల్సి ఉంది. అందులో ఉద్యానవన శాఖ 12 శాతం మొక్కలు నాటే బాధ్యతను స్వీకరించాల్సి ఉంది.. ప్రతి మొక్కా పర్యావరణ పరిరక్షణకు ఉపయోగపడాలి.. వీటితోపాటు అటవీ, పర్యావరణ శాఖలు, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలు, నీటిపారుదల శాఖ, పాఠశాల విద్యాశాఖ, రోడ్లు భవనాల శాఖ, పరిశ్రమల శాఖ, వ్యవసాయ శాఖ, కేంద్ర ప్రభుత్వం అధీనంలో ఉన్న రైల్వే తదితర శాఖలు తమ తమ పరిధిలో లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్లాల్సి ఉందన్నారు జాతీయ రహదారులకి ఇరువైపులా మొక్కలు నాటే సంప్రదాయం ఉంది.. దీన్ని రాష్ట్ర పరిధిలోని రహదారుల నిర్మాణంలోనూ అమలు చేయాలి అన్నారు పవన్.. గ్రేట్ గ్రీన్ వాల్ ప్రాజెక్టు కూడా గ్రీన్ కవర్ పెంపునకు దోహదపడుతుంది.. 970 ఎకరాల తీర ప్రాంతం వెంబడి 40 శాతం అటవీ శాఖ పరిధిలో ఉండగా, మిగిలిన భూభాగంలో ప్రాజెక్టుని ముందుకు తీసుకెళ్లేందుకు అవసరం అయిన ప్రణాళికలు ఆయా శాఖలు సిద్ధం చేయాలి. తీర ప్రాంతం వెంబడి ఉన్న ప్రాంతంలో అక్కడ వాతావరణ పరిస్థితులకు తట్టుకునే మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలి. పారిశ్రామిక కారిడార్లలో కాలుష్య నియంత్రణకు తోడ్పడే మొక్కలను పెంచాలి. రైతుల భూముల్లో వారికి దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించే పండ్ల రకాల మొక్కలు పెంచాలి. కాలువగట్లు, చెరువుల గట్ల వెంబడి కూడా పండ్ల మొక్కలు నాటాలి. మనం నాటే ప్రతి మొక్క పర్యావరణానికి, ప్రజలకు ఉపయోగపడే స్వజాతి మొక్కలు ఉండేలా చూసుకోవాలి. అందుకు సంబంధించి శాఖల వారీ యాక్షన్ ఎ÷-లాన్ అవసరం అన్నారు.. నిర్దేశిత సమయంలో ఎలా ముందుకు వెళ్లాలి అనే అంశంపై ప్రణాళికలు సిద్ధం చేయండి. బ్జడెట్ కేటాయింపులు ముఖ్యమంత్రి తో చర్చిస్తాం.. లక్ష్యాలకు అనుగుణంగా కార్యచరణ సిద్ధం చేసే బాధ్యతను యంత్రాంగం నిబద్ధతతో ముందుకు తీసుకువెళ్లాలి.. అన్ని సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఫిబ్రవరి 5వ తేదీన జరిగే తదుపరి సమావేశానికి పూర్తి స్థాయి ప్రణాళికలతో రావాలని అన్నారు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్..

# శ్రీశైలం, దోర్నాలలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన

**ఆలయ అభివృద్ధిపై అధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్ష**

**నంద్యాలజనవరి 20ప్రజావినికిడి**

శ్రీశైలంకు వచ్చే భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని శ్రీశైలం దేవస్థానానికి ప్రత్యేక విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ శాఖాధికారులను ఆదేశించారు. మంగళవారం నాడు శ్రీశైలం, దోర్నాల ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆలయ అభివృద్ధి పనులు, భక్తుల సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై, శ్రీశైలం దేవస్థానానికి సంబంధించిన భూగర్భ కేబుల్ వ్యవస్థ



ఏర్పాటుపై విస్తృతంగా చర్చించారు. అలాగే శ్రీశైలం మల్లిఖార్జున స్వామి, అమ్మవార్ల రథం సులభంగా తిరిగేలా అవసరమైన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి కావాలని స్పష్టం చేశారు. దోర్నాల వద్ద చెంచు గిరిజనులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాటామంతీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచులు చేసిన విజ్ఞప్తులకు మంత్రి సానుకూలంగా స్పందించారు. గిరిజన తండాలకు ప్రస్తుతం అమలులో ఉన్న సోలార్ విద్యుత్ తరహాలోనే వ్యవసాయ అవసరాలకూ విద్యుత్ అందించే విధానాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఆలయ అభివృద్ధి, మౌలిక వసతులు, గిరిజన సంక్షేమానికి సంబంధించిన అన్ని పనులు మూడు నెలల లోపు పూర్తయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను మంత్రి స్పష్టంగా ఆదేశించారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యేలు ఉగ్రనరసింహారెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు మంత్రితో కలిసి పాల్గొన్నారు.

# నాగులపల్లి గ్రామంలో రైతులకు అవగాహనా కల్పించిన ఏవో నిశాంత్ కుమార్



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్క రైతులు ఉపయోగించుకోవాలని సూచించారు ఫరూక్ నగర్ మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్...మంగళవారం మండల పరిధిలోని నాగులపల్లి గ్రామంలో సర్పంచ్ రాధికా అశోక్ రెడ్డి,గ్రామ పంచాయతీ కార్యదర్శి హరి ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వాల నుండి లభించే పథకాలపై అవగాహనా కల్పించారు.ఇందులో భాగంగా గ్రామంలో ఉన్న ప్రతి ఒక్క రైతు తమ భూమి పట్టా పాసుబ్బాక్, ఆధార్ కార్డు మరియు ఆధార్ కార్డుకు లింకైనా మొబైల్ నెంబర్ తో అందుబాటులో ఉన్న మీసేవా గాని లేదా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి దగ్గర గాని సంప్రదించి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.తద్వారా కేంద్ర,రాష్ట్రాల నుండి వచ్చే ప్రభుత్వ పథకాలు నేరుగా రైతులకు అందటానికి అవకాశం ఉంటుందన్నారు.అన్నదాతలకు పెట్టుబడి సాయం అందించడంతో పాటు,పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వాలు,అధికారులు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారని తెలిపారు.ఏదైనా సందేహాలు ఉంటే అందుబాటులో ఉన్న వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నిశాంత్ కుమార్ తో పాటు ఏఈవో తేజ్ కుమార్,రైతులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

## -కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):**మంగళవారం రోజు బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని హరిహరపురం శ్రీ శ్రీ శ్రీ త్రిశక్తి దేవాలయ12వ వార్షికోత్సవ వేడుకలలో బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి అమ్మవారి దివ్య ఆశీస్సులు పొందడం జరిగింది. అదేవిధంగా ఈ ప్రాంత ప్రజలపై అమ్మవారి దీవెనలు ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని ఈ సందర్భంగా తెలిపారు.

# హామీలను విస్మరించిన రేవంత్ సర్కార్

## గజ్వేల్ ర్యాలీలో ఎంపి రఘునందన్ రావు

గజ్వేల్,**జనవరి 20ప్రజావినికిడి** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరో 20 ఏళ్ల పాటు అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ప్రజలకు ఉపయోగమయ్యే కార్యక్రమాలు పక్కకు పోయాయని అన్నారు. కేవలం ధనార్జనే లక్ష్యంగా మంత్రులు పనిచేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ దారిలోనే కాంగ్రెస్ పాలన ఉందని మండిపడ్డారు. మంగళవారం గజ్వేల్లో రోడ్ షో నిర్వహించిన అనంతరం భాజపా మున్సిపల్ ఎన్నికల విజయ సంకల్ప సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. అధికారంలో ఉన్నప్పుడు తప్పులు చేసిన ఏ నాయకుడైనా శిక్ష అనుభవించాల్సిందేనని చెప్పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి విస్మరించారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మల్లన్నసాగర్ బాధితులకు రూ.240 కోట్లు ఇస్తామన్నారు.. కానీ ఇప్పటివరకు 240 రూపాయలు కూడా ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని అన్నారు.

-----------

# ట్రాఫిక్ సిబ్బందికి గాగుల్స్ అందజేత




హైదరాబాద్,**జనవరి 20ప్రజావినికిడి** సైబరాబాద్ జాయింట్ సీపీ ట్రాఫిక్ డాక్టర్ గజరావు భూపాల్ మంగళవారం సైబరాబాద్ ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి పోలీస్ కమిషనరేట్ లో గాగుల్స్ అందజేశారు.రోడ్లపై విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది కి కాలుష్యం, ఎండ నుంచి రక్షణ కోసం గాగుల్స్ అందజేశామని ఆయన తెలిపారు. ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్యంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంత రావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, కూకట్ పల్లి ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య, బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ గిరిప్రసాద్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్లు, ట్రాఫిక్ సబ్ ఇన్ స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# వరుస ఎన్నికలతో ఖజానాపై భారం !

**జనవరి 20ప్రజావినికిడి**
ఎన్నికలంటే రాజకీయ పార్టీలకు పండగే. అలాగే ఓటర్లకు కూడా పండగలాగే సాగుతోంది. ఓట్ల పండగ ఎప్పుడు జరుగుతందన్న భావనలో ఓటర్లు ఉన్నారు. ఇంటికి కనీసం ఓ పదివేలయినా దక్కుతాయని భావిస్తున్నారు. నిజానికి తెలంగాణలో పంచాయితీ, పరిషత్, మున్సిపల్ ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఇటీవల పంచాయితీ ఎన్నికలను పూర్తి చేశారు. అయితే ఈ ఎన్నికలన్నీ ఒకేదఫా నిర్వహించి ఉంటే ఖజానాపై భారం తప్పేది. ప్రజలకు భారం తప్పేది. కానీ రాజకీయ పార్టీలకు ముఖ్యంగా అధికార పార్టీకి విడతలుగా ఎన్నికలు జరగడం ఇష్టం. జమిలిగా ఎన్నికలు జరిపితే తాము అనుకున్నట్లుగా ఫలితాలు రాకుంటే అభాసుపాలవు తారు. అందుకే తొలుత పంచాయితీ ఎన్నికలు నిర్వహించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. బహుశా ఈ ఫిబ్రవరిలో పంచాయితీ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఆ తరవాత మార్చిలో జడ్పీ ఎన్నికలు జరగవచ్చు. ఇలా విడతలుగా ఎన్నికలు జరిగినా.. ఖజానా గుల్లయినా రాజకీయ పార్టీలకు వచ్చే నష్టం లేదు. ఆ నష్టమేదో ప్రజలు పన్నుల రూపంలో భరిస్తారు. ఇకపోతే ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారు కావడంతో రానున్న వారం రోజుల్లో కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు రాజకీయవర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. వార్డులు, డివిజన్లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వారీగా రిజర్వేషన్లు ఖరారు చేయడంతో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా కసరత్తు చేస్తోంది. ఈక్రమంలో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ను హస్తగతం చేసుకునేందుకు పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్తోంది. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ క్యాండిడేట్లను గెలిపించుకునే బాధ్యతను మంత్రికి అప్పగించింది. ఒక్కో మంత్రిని ఇన్‌ఛార్జులుగా నియమించుకుంది. పార్లమెంట్ నియోజకవర్గానికో ఇన్‌చార్జీను నియమించింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు పార్టీ సింబల్ మీద జరగనుండడంతో అభ్యర్థుల ఎంపిక దగ్గరి నుంచి పోలింగ్ పూర్తయ్యేంత వరకు జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో ఏ చిన్న పొరపాటు జరిగినా గెలుపోటములపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దీంతో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అన్ని స్థానాల్లో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీలు వ్యూహారచనలో ఉన్నాయి. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో త్వరలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఒక కీలకమైన అడుగు పడింది. రాష్ట్ర మున్సిపల్ రిజర్వేషన్ల జాబితా ఖరారు కావడంతో, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ వివరాలను తన అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఈ





జాబితాలో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు , వార్డుల వారీగా కేటాయించిన రిజర్వేషన్లను స్పష్టంగా పొందుపరిచారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 116 మున్సిపాలిటీ లు, 7 మున్సిపల్ కార్పొరేషన్లలో ఉన్న 2,996 వార్డులు , డివిజన్లకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రివర్గం ఫిబ్రవరి నెలలో ఈ ఎన్నికల నిర్వహణకు ఆమోదాన్ని తెలిపింది. ప్రస్తుతం రిజర్వేషన్ల ప్రక్రియ కూడా విజయవంతంగా పూర్తి కావడంతో, ఎన్నికల నిర్వహణకు ఉన్న ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఏ క్షణంలోనైనా అధికారికంగా మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది. అభ్యర్థులు , రాజకీయ పార్టీలు ఈ రిజర్వేషన్ల ఆధారంగా తమ ప్రచార వ్యూహాలను సిద్ధం చేసుకునే పనిలో నిమగ్న మయ్యారు. ఇకపోతే ఇప్పటికే మున్సిపల్ చైర్మన్లు, వార్డుల రిజర్వేషన్లు ఖరారు కావడంతో పట్టణాల్లో ఎన్నికల వేడి ప్రారంభమైంది. ఇప్పటివరకు ఏ వార్డు ఎవరికి రిజర్వ్ అవుతుందోననే టెన్షన్‌తో ఉన్న
ఆశావహులు రిజర్వేషన్లు ఖరారు కావడంతో టికెట్ కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఇక ప్రధాన పార్టీలు గెలుపు గుర్రాలపై ఫోకస్ పెట్టాయి. వార్డుల వారీగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న అభ్యర్థులు, వారి గెలుపోటములపై ప్రభావం చూపే అంశాలను బేరీజు వేసుకుంటున్నారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎన్నికలపై ఫోకస్ పెట్టారు. షెడ్యూల్ ఎప్పుడు వచ్చినా ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులను సిద్ధం చేసుకుంటున్నారు. రాజకీయ పార్టీ లీడర్లు అభ్యర్థుల ఎంపికలో బిజీగా ఉన్నారు. యువ ఓటర్లకు గాలం వేసేందుకు వార్డుల్లో ఆశావహులు తమవంతు ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ క్రమంలో ఫిబ్రవరిలో పట్టణపోరు ప్రారంభం కానుంది. అందుకు అన్ని పార్టీలు కసరత్తులో ఉన్నాయి. గెలుపుపై ధీమాగానూ ఉన్నాయి. అయితే ప్రతి ఎన్నికల్లోనూ పార్టీలు గెలుస్తున్నాయి. ప్రజలు ఓడుతున్నారు. దీనిని వారు గుర్తించడం లేదు. డబ్బులు తీసుకుని ఓట్లు వేయడం పెరిగింది. ఇటీవలి సర్పంచ్ ఎన్నికల్లో ఇది బయటపడింది. డబ్బులు తీసుకుని ఓట్లు వేయలేదని కొందరు అభ్యర్థులు తమ డబ్బులను వాపస్ ఇవ్వాలని నిలదీసారు. ఇలాంటి సంస్కృతి పోతే తప్ప నిజాయితీగా ఎన్నికలు సాగవు.

# రాజ్యసభలో పలు బిల్లులు పెండింగ్

## జనాభా నియంత్రణ సహా 19 బిల్లుకు దక్కని మోక్షం

న్యూఢిల్లీ, **జనవరి 20ప్రజావినికిడి**రాజ్యసభలో 19 ప్రభుత్వ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో 1992 నాటి జనాభా నియంత్రణకు సంబంధించిన బిల్లు కూడా ఉంది. రాజ్యసభ అనేది శాశ్వత సభ, ఇది ఎప్పటికీ రద్దు చేయబడదు. దాని సభ్యులలో మూడింట ఒక వంతు మంది ప్రతి రెండేళ్లకు పదవీ విరమణ చేస్తారు. లోక్‌సభ లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు సభ రద్దయితే, అవి కూడా రద్దవుతాయి. రాజ్యసభలో పెం డింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడూ రద్దు కావు. రాజ్యసభ బులెటిన్ ప్రకారం.. ప్రస్తుతం 19 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో పురాతనమైనది రాజ్యాంగ (79 సవరణ) బిల్లు-1992. జనాభా నియంత్రణ, చిన్న కుటుంబ నియమాన్ని ప్రభుత్వం ప్రోత్సహిం చాలని, ప్రాథమిక విధుల్లో చిన్న కుటుంబ నియమాన్ని ప్రోత్సహించడం, స్వీకరించడం చేర్చాలని ప్రభుత్వ విధాన నిర్దేశక సూత్రాలను సవరించాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలుంటే ఎంపి లేదా ఎమ్మెల్యేను అనర్హులుగా ప్రకటించాలని కూడా ఇది ప్రతిపాదించింది. పెండింగ్ బిల్లుల్లో ఢిల్లీ అద్దె (సవరణ) బిల్లు-1997 కూడా ఉంది. ఇది అ÷-దదె నియంత్రణ చట్టాలను ఆధునీకరించడానికి ఉద్దేశించిన ఢిల్లీ అ÷-దదె చట్టం-1995ను సవరించడానికి ఉద్దేశించబడింది. కానీ అద్దెదారులు, భూస్వామి సమూహాల నుండి గణనీయమైన వ్యతిరేకతను ఎదుర్కొంది. ప్రభుత్వం సీడ్ బిల్లు-2025 తీసుకు రావడానికి ప్రయత్నిస్తుండగా, పెండింగ్ బిల్లుల్లో సీడ్స్ బిల్లు-2004 ఉంది. ఇది అమ్మకం, దిగుమతి, ఎగుమతి కోసం విత్తనాల నాణ్యతను నియంత్రించడం, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి, సరఫరాను సులభతరం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది.కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే కార్మికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన అంతర్రాష్ట్ర వలస కార్మికుల (ఉపాధి నియంత్రణ, సేవా పరిస్థితుల) సవరణ బిల్లు-2011 కూడా పెండింగ్‌లో ఉంది.యుపిఎ-2లో ప్రవేశపెట్టిన ఇతర పెండింగ్ బిల్లుల్లో భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంబంధిత చట్టాలు (సవరణ) బిల్లు-2013, ఉపాధి మార్పిడి సవరణ బిల్లు-2013, పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్ వ్యవస్థీకరణ (మూడో) బిల్లు-2013 ఉన్నాయి.న్డిఎ పాలనలో ప్రవేశపెట్టిన పెండింగ్ బిల్లుల్లో అస్సాం, మేఘాలయ, త్రిపుర, మిజోరాంలలో స్వయం ప్రతిపత్తి మండళ్ల ఆర్థిక, కార్యనిర్వాహక అధికారాలను పెంచడంతో ఈశాన్య ప్రాంతంలో గిరిజన స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేయడానికి ఉద్దేశించిన బిల్లు. ప్రవాస భారతీయుల వివా హ నమోదు బిల్లు-2019 వంటి బిల్లులు ఉన్నాయి. తాజాగా ది పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ బిల్లు-2020 పెండింగ్‌లో ఉంది.



# శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసు

### విచారణలో దూకుడు పెంచిన ఇడి

### మూడు రాష్ట్రాల్లో ఏకకాలంలో సోదాలు


తిరువనంతపురం**జనవరి 20ప్రజావినికిడి**
శబరిమల ఆలయ బంగారు తాపడాల కేసుపై విచారణ జరుపుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఇటీవల సుప్రీం కూడా ఈ ఏసుపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ కేసు విచారణలో భాగంగా మంగళవారం మూడు రాష్ట్రాల్లోని 21 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు చేపట్టింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేరళ, కర్ణాటక, తమిళనాడులలో ఈ సోదాలు జరుగుతున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఉన్నికృష్ణన్ పొట్టి, ట్రావన్‌కోర్ దేవశ్వం బోర్డు మాజీ అధ్యక్షుడు పద్మకుమార్‌లకు సంబంధం ఉన్న ప్రాంతాల్లోను, వారి సన్నిహితులకు సంబంధించిన ఇళ్లల్లోనూ ఏకకాలంలో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు ఈ కేసుపై కేరళ హైకోర్టు పర్యవేక్షణలో పనిచేస్తున్న రాష్ట్ర ప్రత్యేక దర్యాప్తు బృందం కూడా దర్యాప్తు చేస్తోంది. ఈ కేసులో మరింత క్షుణ్ణంగా దర్యాప్తు చేపట్టడానికి బంగారు తాపడాల పునరుద్ధరణ పనుల్లో భాగమైన ఇతర అధికారులను కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో ఇటీవల అరెస్టైన టీడీబీ మాజీ అధ్యక్షులు ఎ.పద్మకుమార్, మాజీ సభ్యుడు కె.పి.శంకరదాస్‌ల హయాంలోనే ఈ అక్రమాలకు బీజం పడిందన్నారు. శబరిమల ఆలయంలో ఆన్-సైట్ తనిఖీ చేయాలని కేరళ హైకోర్టు ఇటీవల సిట్ అధికారులను ఆదేశించింది. మరోవైపు ఈ కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు బదిలీ చేయాలని భక్తులు, పలువురు అధికారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కేసులో ఆలయ ప్రధాన పూజారి సహా ఇప్పటివరకు 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు.



# జాతీయగీతాలపనకు నిరాకరణ

### తమిళ అసెంబ్లీ నుంచి నిష్క్రమించిన గవర్నర్

చెన్నై **జనవరి 20ప్రజావినికిడి:** తమిళనాడు శాసనసభ సమావేశంలో తన ప్రసంగాన్ని చదవకుండానే గవర్నర్ ఆర్.ఎన్.రవి నిష్క్రమించారు. ఈ ఏడాది శాసనసభ తొలి సమావేశం మంగళవారం ప్రారంభం కాగా తన ప్రసంగాన్ని చదవకుండానే ఆయన వాకౌట్ చేశారు. తమిళతల్లి ప్రార్థనా గీతం తర్వాత జాతీయగీతం ఆలపించాలని సభాపతిని గవర్నర్ కోరగా అందుకు నిరాకరించడంతో ఆయన వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. అన్ని శాసనసభల్లోనూ గవర్నర్ ప్రసంగానికి ముందు, తర్వాత జాతీయగీతాన్ని పాడతారని, ఇక్కడ ప్రసంగానికి ముందు ఆలపించాలని కోరినా ఉద్దేశపూర్వకంగానే నిరాకరించారని లోక్‌భవన్ వెల్లడించింది.



# 26 నుంచి ఫిబ్రవరి 1 వరకు విశాఖ ఉత్సవ్

### లోగో, టీ షర్ట్, ఈవెంట్ బ్రోచర్స్ లాంచ్ చేసిన అనిత

విశాఖపట్నం,**జనవరి 20ప్రజావినికిడి**
విశాఖపట్నం ప్రజలకు, ఎన్డీఏ కూటమికి అవినాభావ సంబంధం ఉందని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత వ్యాఖ్యానించారు. హెల్దీ, వెల్దీ, హ్యాపీనే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని పేర్కొన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో భిన్న వాతావరణం ఉంటుందని తెలిపారు. అనకాపల్లి జిల్లా వైభవం చాలా గొప్పదని చెప్పుకొచ్చారు. ఈనెల 26వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు విశాఖ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన కర్టెన్ రైజ్ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో లోగో, టీ షర్ట్, ఈవెంట్ బ్రోచర్స్ లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు అనిత, కందుల దుర్గేశ్, కొల్లు రవీంద్ర, బాల వీరాంజనేయ స్వామి, సంధ్యారాణి ఎంపీ, ఎమ్మెల్యేలు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత ప్రసంగించారు. ఏకకాలంలో విశాఖపట్నం, అనకాపల్లిలో ఈ ఉత్సవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాగరం నుంచి శిఖరం వరకు టైటిల్‌తో.. ఇండియాస్ బి÷-గగెస్ట్ బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అనకాపల్లి జిల్లాలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వివరించారు. ఏటికొప్పాక బొమ్మలు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాయని వివరించారు. ఈ ఉత్సవాల్లో ప్రజలు పోలీసులకు సహకరించాలని హోంమంత్రి అనిత సూచించారు. మూడు జిల్లాల్లో విశాఖ ఉత్సవ్‌ను అద్భుతంగా డిజైన్ చేశారని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో చీకటి రోజులు ఉన్నాయని తెలిపారు. విశాఖలో యోగా డే గిన్నిస్ రికార్డ్ సాధించిందని వెల్లడించారు. విశాఖ ఉత్సవ్ గ్రాండ్ సక్సెస్ అవుతుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తాగితే ఆరుకు కాఫీ తాగాలి, తింటే అనకాపల్లి బెల్లం తినాలని.. చూస్తే విశాఖ ఉత్సవ్‌ను చూడాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. అరకు అందాలను మరింత అందంగా చూపించేలానే ప్రయత్నంతో విశాఖ ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశాఖ ఉత్సవ్‌ను మూడు జిల్లాల ప్రజలు విజయవంతం చేయాలని మంత్రి గుమ్మడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. విశాఖ ఉత్సవ్‌ను దేశంలోనే పెద్ద బీచ్ ఫెస్టివల్‌గా బ్రాండింగ్ చేస్తున్నామని టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వ్యాఖ్యానించారు. కూటమి ప్రభుత్వంలో రాష్ట్ర ప్రజలు ఆనందంగా ఉన్నారని తెలిపారు. సంక్రాంతి ఘనంగా చేసుకున్నామని అన్నారు. విశాఖ ఉత్సవ్ ఘనంగా నిర్వహించుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు. విశాఖ ఉత్సవ్‌లో స్థానిక కళాకారులకు అవకాశం కల్పించాలని సూచించారు. స్థానికంగా ఉన్న వంటకాలను విశాఖ ఉత్సవ్‌లో ప్రోత్సహించాలని పల్లా శ్రీనివాసరావు కోరారు




# దావోస్‌లో ఐబీఎం చైర్మన్ తో సీఎం చంద్రబాబు కీలక సమావేశం

**జనవరి 20ప్రజావినికిడి**
ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రపంచ ప్రఖ్యాత టెక్ సంస్థ ఐబీఎం (×దీవీ) చైర్మన్, సీఈవో అరవింద్ కృష్ణతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో క్వాంటం ఇన్నోవేషన్ సెంటర్, ప్రత్యేకించి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా చంద్రబాబు ప్రతిపాదించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు ఐబీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.ఈ సమావేశంలో ముఖ్యమంత్రితో పాటు ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ కూడా పాల్గొన్నారు. క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు పూర్తి సహకారం అందించాలని వారు ఐబీఎంను కోరారు. ఈ భేటీ ఫలప్రదంగా జరిగిందని, రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి ఇది దోహదపడుతుందని అధికారులు తెలిపారు.ఇదే భేటీలో యువతకు కృత్రిమ మేధ (ూ×)లో శిక్షణ ఇచ్చే అంశంపైనా చర్చ జరిగింది. దేశవ్యాప్తంగా 50 లక్షల మంది యువతకు ఏఐలో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఐబీఎం సిద్ధంగా ఉందని అరవింద్ కృష్ణ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 10 లక్షల మంది యువతకు అవకాశం కల్పించాలని మంత్రి నారా లోకేశ్ విజ్ఞప్తి చేశారు.ప్రపంచ ఆర్థిక వేదిక (ఔజుఖీ) వార్షిక సదస్సులో భాగంగా చంద్రబాబు, లోకేశ్ బృందం టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు వరుస భేటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఐబీఎంతో జరిగిన ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.




# గంభీర్ తప్పిదం వల్లే ఘోర ఓటమి

**• వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే**



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనాలోచిత నిర్ణయాల కారణంగానే న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయం ఎదురైందని వెటరన్ బ్యాటర్ అజింక్యా రహానే అన్నాడు. జట్టులో తరుచూ మార్పులు చేయడం టీమిండియా ఓటమిని శాసించిందని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌ను 2-1తో టీమిండియా కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ గెలిచిన టీమిండియా.. తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో ఓటమిపాలైంది. 38 ఏళ్ల తర్వాత భారత గడ్డపై న్యూజిలాండ్ తొలి వన్డే సిరీస్ గెలిచింది. ఈ పరాజయం నేపథ్యంలో టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు మేనేజ్‌మెంట్‌పై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఈ పరాజయంపై మాట్లాడిన రహానే.. టీమిండియా ఓటములపై బరాబర్ ప్రశ్నలు వస్తాయని తెలిపాడు. 'జట్టు ప్రదర్శనపై కచ్చితంగా కఠినమైన ప్రశ్నలు ఎదురవుతాయి. భారత్ గత 9 వన్డేల్లో ఐదు ఓడిపోయింది. అందుకు కారణం.. జట్టులో అతిగా మార్పులు చేయడం. అందుకే మేనేజ్‌మెంట్ నుంచి ఆటగాళ్లకు తమ స్థానాలపై భరోసా కావాలని చెబతున్నా. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీలకు సిద్ధమవుతున్నప్పుడు మేనేజ్‌మెంట్ నుంచి ఆటగాళ్లకు భద్రతతో పాటు స్పష్టత అవసరం. ఒక నిర్దిష్ట ఫార్మాట్‌లో కొందరు ఆటగాళ్లను ఆడించాలనుకున్నప్పుడు.. ఆ విషయంలో వారికి స్పష్టత ఉండాలి. ఓటములు ఎదురైనప్పుడు ప్రశ్నలు వస్తాయి. అది చాలా సహజం. ఎందుకంటే అభిమానులు భారత క్రికెట్‌తో అంతగా ముడిపడి ఉంటారు. భారత బాగా ఆడాలని, మ్యాచ్ గెలవాలని, సిరీస్ గెలవాలని కోరుకుంటారు.



# స్టేడియంలో చెలరేగిన మంటలు.. ప్రాణభయంతో పరుగులు తీసిన జనం!

ఆస్ట్రేలియాలో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న బిగ్ బాష్ లీగ్ మ్యాచ్‌లో అనూహ్య ఘటన చోటుచేసుకుంది. మంగళవారం (జనవరి 20) పెర్త్ వేదికగా పెర్త్ స్కార్చర్స్, సిడ్నీ సిక్సర్స్ మధ్య క్వాలిఫైయర్ మ్యాచ్ జరుగుతుండగా, స్టేడియంలోని ఒక భాగంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పెర్త్ ఆప్టస్ స్టేడియం భవనానికి బయటి వైపు ఉన్న ఒక గది నుంచి నల్లటి పొగ భారీగా ఆకాశంలోకి వ్యాపించడంతో స్టేడియంలో ఉన్న వారంతా భయాందోళనకు గురయ్యారు. మ్యాచ్ జరుగుతున్న సమయంలోనే ఈ ఘటన జరగడం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. తొలి ఇన్నింగ్స్‌లో పెర్త్ స్కార్చర్స్ బ్యాటింగ్ చేస్తున్న సమయంలో స్టేడియం భవనం నుంచి పొగ రావడం టీవీ స్క్రీన్లపై స్పష్టంగా కనిపించింది. వెంటనే అప్రమత్తమైన స్టేడియం సెక్యూరిటీ సిబ్బంది, అగ్నిమాపక దళం అక్కడికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

అదృష్టవశాత్తూ ఈ ప్రమాదం స్టేడియం బయటి గదిలో జరగడంతో ప్రాణనష్టం తప్పింది. ఆటగాళ్లకు లేదా ప్రేక్షకులకు ఎటువంటి హాని కలగలేదు. కాసేపు గందరగోళం నెలకొన్నప్పటికీ, మంటలు అదుపులోకి రావడంతో మ్యాచ్‌ను యథావిధిగా కొనసాగించారు.

# వరల్డ్ కప్‌లో అగ్రస్థానంలో టీమిండియా

ఐసీసీ అండర్-19 ప్రపంచకప్ 2026లో భారత యువ జట్టు విజయ యాత్ర కొనసాగిస్తోంది. శనివారం బంగ్లాదేశ్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆయుష్ కెప్టెన్సీలోని టీమిండియా 18 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో భారత్ అధికారికంగా సూపర్-6 దశకు చేరుకుంది. సూపర్-6కు అర్హత సాధించిన మొదటి జట్టుగా భారత్ నిలిచింది. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో అమెరికాను 6 వికెట్ల తేడాతో చిత్తు చేసిన భారత్, ఇప్పుడు వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసి గ్రూప్-బిలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ మెగా టోర్నీలో మొత్తం 16 జట్లు తలపడుతున్నాయి. వీటిని నాలుగు గ్రూపులుగా విభజించగా, ప్రతి గ్రూపు నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్-6కు వెళ్తాయి. ప్రస్తుతం భారత్ ఉన్న గ్రూప్-బిలో న్యూజిలాండ్ రెండో స్థానంలో ఉండగా, అమెరికా మూడో స్థానంలో ఉంది. బంగ్లాదేశ్ తన మొదటి మ్యాచ్‌లో ఓడిపోయి చివరి స్థానంలో ఉంది. భారత్ ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఆల్ రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకోవడం విశేషం. మిగిలిన గ్రూపుల విషయానికి వస్తే.. గ్రూప్-ఏలో శ్రీలంక, గ్రూప్-సిలో ఇంగ్లండ్, గ్రూప్-డిలో ఆఫ్ఘనిస్తాన్ తమ ఆధిపత్యాన్ని చాటుతున్నాయి. ఆశ్చర్యకరంగా గ్రూప్-డిలో బలమైన దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్ల కంటే ఆఫ్ఘనిస్తాన్ ముందంజలో ఉంది. పాకిస్తాన్ గ్రూప్-సిలో ఇంగ్లండ్ తర్వాత రెండో స్థానంలో కొనసాగుతోంది. భారత జట్టు తదుపరి మ్యాచ్‌లలో ఇదే ఫామ్ కొనసాగిస్తే, ఆరోసారి టైటిల్ గెలవడం కష్టమేమీ కాదని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జడేజా వన్డేల్లో రిటైర్మెంట్ తీసుకుంటున్నాడా?

భారత్ క్రికెట్ చరిత్రలో అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకరిగా ఉన్న రవీంద్ర జడేజా కెరీర్ ఇప్పుడు ఒక కీలక మలుపులో ఉన్నట్టు కనిపిస్తోంది. గత దశాబ్దం కాలంగా మూడు ఫార్మాట్‌లలో టీమ్ ఇండియాకు వెన్నెముకగా నిలిచిన ఈ సౌరాష్ట్రస్టార్ తాజాగా తన రిటైర్మెంట్‌పై చేసిన వ్యాఖ్య సంచలనంగా మారుతున్నాయి. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో జడేజా ప్రదర్శనఆశించిన స్థాయిలో లేదు. ఆల్‌రౌండర్‌గా జట్టులో తన ప్రాధాన్యతను నిరూపించుకోవాల్సిన చోట ఆయన విఫలమయ్యాడు. మూడు మ్యాచ్‌ల్లో కలిపి కనీసం ఒక్క వికెట్ కూడా తీయలేకపోవడం, అలాగే బ్యాటింగ్‌లో మూడు ఇన్నింగ్స్‌లు ఆడి కనీసం 30 పరుగులు కూడా చేయలేకపోవడం అభిమానులను, విశ్లేషకులను విస్మయానికి గురి చేసింది. సోషల్ మీడియాలో ప్రస్తుతం ఒక వీడియో విపరీతంగా వైరల్ అవుతుంది. అందులో రవీంద్ర జడేజా, వికెట్ కీపర్ బ్యాట్ రిషబ్ పంత్ ఒక కార్యక్రమంలో పాల్గొని సరదాగా ముచ్చటించారు. ఆ సమయంలో వారిద్దరినీ మీరు ఎప్పుడైనా సినిమాల్లో నటించాలని అనుకున్నారా అని ప్రశ్నించగా పంత్ సమాధానమిస్తూ.... నేను ఇంకా దాని గురించి ఆలోచించలేదు. నన్ను క్రికెట్ ఆడనివ్వండి, జడేజా భాయ్ గురించి నాకు తెలియదు. అని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి జడేజా స్పందిస్తూ నవ్వుతూనే ఒక బాంబు పేల్చారు. అంటే నా సమయం అయిపోయిందని పరోక్షంగా చెబుతున్నాడు అని జడేజా వ్యాఖ్యానించారు. పైకి ఇది నవ్వుతూ అన్న మాట అయినప్పటికీ అంతర్జాతీయ క్రికెట్‌లో తన ప్రస్థానం ముగింపు దశకు చేరుకుదని సంకేతాన్ని ఆయన ఇచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే 2024 టీ 20 ప్రపంచ కప్ తర్వాత జడేజా టీ 20 ఇంటర్నేషనల ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అతను ప్రస్తుతం ఆయన కేవలం టెస్టు, వన్డే క్రికెట్‌లో మాత్రమే కొనసాగుతున్నాడు. జడేజా తర్వాత వాషింగ్టన్ సుందర్ లేదా అక్షర్ పటేల్‌లలో ఒకరు వన్డేలలో అతని స్థానంలో రావచ్చు. అయితే, ఇద్దరు ఆటగాళ్లు చాలా కాలంగా భారతదేశం కోసం వన్డే క్రికెట్ ఆడుతున్నారు. అక్షర్ ఇప్పటివరకు 71 వన్డేలు, వాషింగ్టన్ 29 వన్డే మ్యాచ్‌లు ఆడారు.



# ఒకే రోజు రెండు భారత్ వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్‌లు..!





టోర్నీ ఏదైనా సరే భారత్, పాకిస్తాన్ జట్లు తలపడుతున్నాయంటే వచ్చే కిక్కే వేరు. ఇరు దేశాల అభిమానులే కాదు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న క్రికెట్ ఫ్యాన్స్ సైతం భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు అన్న సంగతిని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇక ఇప్పుడు అందరి దృష్టి ఫిబ్రవరి 15 పైనే ఉంది. ఎందుకంటే ఆ రోజు టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. అయితే.. అదే రోజు మరో భారత్ వర్సెస్ పాక్ మ్యాచ్ కూడా జరగనుంది. తొలి మ్యాచ్ లో పురుషుల జట్లు తలపడనుండగా రెండో మ్యాచ్ మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భాగంగా జరగనుంది. మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ షెడ్యూల్‌ను ఆసియా క్రికెట్ కౌన్సిల్ విడుదల చేసింది.

# తిలక్ వర్మ ప్లేస్‌లో ఆడేది ఎవరు?

**• నేటినుండి విండీస్ తో భారత్ తొలి టీ20 మ్యాచ్ • జట్టులో కొన్ని కీలక మార్పులకు అవకాశం • జట్టులోకి రానున్న శ్రేయస్ అయ్యర్**



వన్డే సిరీస్‌ను కోల్పోయిన కసిలో ఉన్న టీమిండియా, ఇప్పుడు పొట్టి ఫార్మాట్‌లో కివీస్‌ను దెబ్బకొట్టేందుకు సిద్ధమైంది. నాగ్‌పూర్‌లోని విదర్భ క్రికెట్ అసోసియేషన్ స్టేడియం వేదికగా బుధవారం (జనవరి 21) రాత్రి 7 గంటలకు తొలి టీ20 మ్యాచ్ ప్రారంభం కానుంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత జట్టులో కొన్ని కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. టీమిండియా యువ బ్యాటర్ తిలక్ వర్మ గాయం కారణంగా ఈ సిరీస్‌లోని మొదటి మూడు మ్యాచ్‌లకు దూరం కావడం భారత జట్టుకు పెద్ద ఎదురుదెబ్బ. అతనికి ఆపరేషన్ జరగడంతో, అతని స్థానంలో వెటరన్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌ను జట్టులోకి తీసుకున్నారు. అయితే, టీ20 వరల్డ్ కప్ 2026 జట్టులో ఉన్న ఇషాన్ కిషన్ కూడా రేసులో ఉన్నాడు. సుదీర్ఘ కాలం తర్వాత జట్టులోకి వచ్చిన ఇషాన్ కిషన్‌ను మిడిల్ ఆర్డర్‌లో ఆడిస్తారా లేక శ్రేయస్ అయ్యర్‌కు అవకాశం ఇస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. అయ్యర్ ప్రస్తుతం వరల్డ్ కప్ జట్టులో లేనందున, బ్యాకప్ ప్లేయర్‌గా అతన్ని పరీక్షించే అవకాశం ఉంది. ఓపెనింగ్‌లో అభిషేక్ శర్మతో కలిసి సంజూ శాంసన్ వచ్చే అవకాశం ఉంది. వికెట్ కీపర్ బాధ్యతలతో పాటు ఓపెనర్‌గా సంజూ తన మార్క్ చూపించాల్సి ఉంది. వన్డేల్లో వైఫల్యాలు చవిచూసిన సూర్యకుమార్ యాదవ్, తనకు ఇష్టమైన టీ20 ఫార్మాట్‌లో మళ్ళీ ఫామ్ అందుకోవాలని చూస్తున్నాడు. ఆల్ రౌండర్ల విభాగంలో హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శివం దూబేలు జట్టుకు బలాన్ని ఇస్తున్నారు. ఇక ఫినిషర్ పాత్రలో రింకూ సింగ్ మరోసారి తన పవర్ చూపించడానికి సిద్ధమయ్యాడు. బౌలింగ్ విషయానికి వస్తే.. జస్ప్రీత్ బుమ్రా నాయకత్వంలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణాలు పేస్ బాధ్యతలు మోయనున్నారు. నాగ్‌పూర్ పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది కాబట్టి, వరుణ్ చక్రవర్తి ప్రధాన స్పిన్నర్‌గా బరిలోకి దిగడం ఖాయం. మరో స్పిన్ ఆప్షన్‌గా రవి బిష్ణోయ్ లేదా కుల్దీప్ యాదవ్‌లలో ఒకరిని ఎంచుకోవాల్సి ఉంటుంది. వన్డే సిరీస్ కోల్పోయిన భారత్, ఈ టీ20 సిరీస్‌ను విజయంతో ప్రారంభించి వరల్డ్ కప్ ముందర ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని భావిస్తోంది.




# జడేజా కోహ్లీని చూసి నేర్చుకోవాలి: అశ్విన్

పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతున్న టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజాకు మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ కీలక సలహా ఇచ్చాడు. టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తరహాలో జడేజా తన ఆటను మెరుగుపర్చుకోవాలని సూచించాడు.ఆటలో కొత్త ప్రయోగాలు చేయాలని జడేజాకు తాను ఎప్పుడూ చెబుతూ ఉంటానని, కానీ అతను తన బౌలింగ్ శైలిని మార్చుకోడని చెప్పాడు. కొన్నేళ్లుగా బ్యాటింగ్, బౌలింగ్‌లో నిలకడగా రాణిస్తుండటంతోనే జడేజా ఇలా మొండిగా తయారయ్యాడని తెలిపాడు.న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్‌లో జడేజా దారుణంగా విఫలమయ్యాడు. బ్యాటింగ్‌లో తీవ్రంగా నిరాశపర్చిన జడేజా బౌలింగ్‌లో ఒకే ఒక్క వికెట్ తీసాడు. ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. అతని వైఫల్యం టీమిండియా విజయవకాశాలను ప్రభావితం చేసింది. ఈ సిరీస్‌లో 2 1తో భారత్ ఘోర పరాజయం చవిచూసింది.ఈ క్రమంలోనే తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా జడేజా గురించి మాట్లాడిన అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'జడేజాకు తాను నమ్మే కొన్ని బలాలు ఉన్నాయి. అతను తన బలాలకు మించి ఏమి చేయడు. కాస్త నెమ్మదిగా.. భిన్నంగా బౌలింగ్ చేయాలని సూచించినా పట్టించుకోడు. ఎందుకంటే జడేజా తన బలాలను నమ్ముకొనే బౌలింగ్ చేస్తాడు.అతని బలాలే కొన్నిసార్లు బలహీనతలుగా మారుతున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మూడు విభాగాల్లో అతనికి ఉన్న నైపుణ్యం అసాధారణం. కానీ కొత్త ప్రయోగాలు చేయడు. నెట్స్‌లో క్యారమ్ బాల్స్ వేస్తాడు, కానీ మ్యాచ్‌లో మాత్రం ప్రయత్నించడు. లెజెండ్ అయిన జడేజాకు కోల్పోయేదేమీ లేదు. కొంచెం ఫంకీగా ఆడితే చూడాలని ఉంది. అతను నిరూపించుకోవాల్సింది కూడా ఏం లేదు. ఎప్పటికీ జడేజా దిగ్గజమే.విరాట్ కోహ్లీలా జడేజా కూడా తన ఆటను మెరుగుపర్చుకోవాలి. కోహ్లీ ప్రస్తుతం ఎలాంటి చింత లేకుండా ఆడుతున్నాడు. ఈ ప్రపంచానికి తానే రాజును అన్నట్లు ఆటను ఆస్వాదిస్తున్నాడు. అందుకే అతను ఇంత బాగా రాణిస్తున్నాడు. జడేజాకు ఇది సవాల్‌తో కూడిన సమయం. అక్షర్ పటేల్ అతని స్థానాన్ని భర్తీ చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. జడేజా వన్డేల్లో ఎన్నో గొప్ప ప్రదర్శనలు చేశాడు. కానీ ఇప్పుడు చర్చంతా అతని బ్యాటింగ్ చుట్టూనే తిరుగుతోంది. స్పిన్నర్లపై తక్కువ స్ట్రైక్ రేట్ గురించి మాట్లాడుతున్నారు. అయితే ఇప్పుడే ఎవరి భవిష్యత్తుపై తీర్పు ఇవ్వడం తొందరపాటు అవుతుంది.'అని అశ్విన్ చెప్పుకొచ్చాడు.




## ‘దండోరా’పై ఎన్టీఆర్ ప్రశంసల జల్లు.. ఓటీటీలో రికార్డుల మోత!

టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘దండోరా’ చిత్రంపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇది ఎంతో లోతైన, శక్తిమంతమైన, ఆలోచింపజేసే చిత్రమని కొనియాడారు. సినిమా చూసిన అనంతరం తన అభిప్రాయాన్ని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆయన పంచుకున్నారు.

“ఇప్పుడే దండోరా సినిమా చూశాను. ఇంతటి బలమైన రచనతో, మన మూలాలకు దగ్గరగా ఉండే కథను ఎంతో చక్కగా తెరకెక్కించిన దర్శకుడు మురళీ కాంత్ గారికి నా హ్యాట్సాఫ్” అని ఎన్టీఆర్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. శివాజీ, నవదీప్, నందు, రవికృష్ణ, బిందు మాధవి అద్భుతంగా నటించారని మెచ్చుకున్నారు. ఇంత మంచి ప్రయత్నాన్ని ప్రోత్సహించిన నిర్మాత రవీంద్ర బెనర్జీకి, చిత్ర బృందానికి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఎన్టీఆర్ వంటి అగ్ర నటుడి నుంచి ప్రశంసలు దక్కడంతో ‘దండోరా’ చిత్ర యూనిట్ ఆనందంలో మునిగిపోయింది. “ఎన్టీఆర్ అన్న నా పేరు పలికారు. ఇది నాకు చాలు” అంటూ దర్శకుడు మురళీ కాంత్ భావోద్వేగానికి గురవ్వగా, ఇదే తమకు అసలైన విజయమని నిర్మాత సంతోషం వ్యక్తం చేశారు.గతేడాది డిసెంబర్ 25న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతోంది. తాజాగా ఎన్టీఆర్ ప్రశంసలతో ఈ చిత్రానికి ఒక్కసారిగా క్రేజ్ వచ్చింది. ఫలితంగా ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్‌లో

## దృశ్యం-3 కోసం వెంకటేశ్ బిజీ

కథానాయకుడు వెంకటేశ్ ప్రస్తుతం చిరంజీవితో కలిసి ’మన శంకరవర ప్రసాద్‌గారు’ చిత్రంతో థియేటర్లలో నవ్వులు పంచుతున్న సంగతి తెలిసిందే. ఇక ఆయన సోలో హీరోగా చేస్తున్న సినిమా ’ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47’ శరవేగంగా చిత్రీకరణ చేసుకుంటోంది. త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం ఈ వేసవిలోనే థియేటర్లలో సందడి చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. కానీ, దీని తర్వాత వెంకీ చేయనున్న సినిమా ఏదన్నది ఇంకా వెల్లడించలేదు. అయితే ఇప్పుడీ అంశంపై నిర్మాత సురేశ్‌బాబు నుంచి స్పష్టత వచ్చింది. త్రివిక్రమ్ సినిమా పూర్తయిన వెంటనే వెంకటేశ్ ’దృశ్యం 3’ కోసం రంగంలోకి దిగనున్నట్లు వెల్లడించారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే ఈ సినిమాని హిందీ ’దృశ్యం 3’తో పాటుగా అక్టోబరులో విడుదల చేసే అవకాశముందన్నారు. ఇక ఇప్పటికే ’దృశ్యం 3’ మలయాళ వెర్షన్ చిత్రీకరణ పూర్తి చేసుకోగా.. అది ఏప్రిల్‌లో విడుదల కానుంది.



## విజయ్ సేతుపతితో మణిరత్నం సినిమా హీరోయిన్‌గా సాయిపల్లవి ఖరారు




తనదైన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న తమిళ నటుడు విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆయన సూపర్ స్టార్ రజనీకాంత్ తో జైలర్ 2 తో పాటు టాలీవుడ్ దర్శకుడు పూరి జగన్నాథ్ డైరెక్షన్ లో స్లమ్ డాగ్ అనే సినిమా అలాగే మరికొన్ని చిత్రాల్లో నటిస్తున్నారు. ఇదిలా ఉండగా విజయ్ సేతుపతి నెక్స్ట్ సినిమాపై కోలీవుడ్ లో ఒక ఆసక్తికర చర్చ జరుగుతుంది. తాజా సమాచారం ప్రకారం, విజయ్ సేతుపతి ప్రముఖ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో ఓ సినిమాలో నటించనున్నారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ కథను మణిరత్నం తొలుత సిలంబరాసన్ టీఆర్ శింబు కోసం రాసుకున్నారట. అయితే కొన్ని కారణాల వల్ల శింబు ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదట. దీంతో అదే కథకు విజయ్ సేతుపతిని హీరోగా ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో విజయ్ సేతుపతికి జోడీగా సాయి పల్లవి నటించనున్నారు. సహజమైన నటనకు పేరు తెచ్చుకున్న సాయి పల్లవి, సుప్రసిద్ధ దర్శకులు మణిరత్నం డైరెక్షన్, విజయ్ సేతుపతి లాంటి పవర్‌ఫుల్ నటుడు కలిసి చేసే ఈ సినిమాపై అంచనాలు ఓ రేంజ్ లో ఉంటాయనడంలో సందేహం లేదు. ప్రస్తుతం చేస్తున్న సినిమాల తర్వాత విజయ్ సేతుపతి కెరీర్‌లో ఈ మణిరత్నం సినిమాను సెట్స్ పైకి తీసుకువెళ్లాలా ఎ÷–లాన్ చేస్తున్నారట. ఈ చిత్రం సేతుపతి కెరీర్ లో ఓ ప్రత్యేకమైన మైలురాయిగా నిలిచే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## తల్లిదండ్రులు లేని ఆడపిల్లను ఇండస్ట్రీలో అందరూ టార్గెట్ చేస్తారు: ఈషా రెబ్బా

అచ్చు తెలుగు హీరోయిన్ ఈషా రెబ్బా తన కెరీర్‌లో ఎదుర్కొన్న కష్టాలను అందరితో పంచుకుంది. తెలుగు సినిమా ఇండస్ట్రీలో అడుగుపెట్టి 12 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ ఆమె సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తోంది. తన స్కిన్ కలర్ వల్ల ఎదురైన అవమానాల గురించి ఇటీవల ఆమె మాట్లాడింది. ‘ఓం శాంతి శాంతి’ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా ఈషా వెల్లడించిన విషయాలు చర్చనీయాంశంగా మారాయి.తన కెరీర్ ప్రారంభంలో ఒక ఫొటో షూట్ సమయంలో, ఒక స్టార్ డైరెక్టర్ తన శరీరాన్ని అంగుళం అంగుళం జూమ్ చేసి చూస్తూ... నీ మోచేతులు నల్లగా ఉన్నాయని, నీవు ఇంకా తెల్లగా ఉండాలని అన్నాడని... ఆ వ్యాఖ్యలు ఎంతో బాధించాయని చెప్పింది. ఆ మాటలు విన్న తర్వాత చాలా ఏడ్చానని, కొంచెం తెల్లగా పుట్టి ఉంటే బాగుండేది అనిపించిందని తెలిపింది. తన తల్లి మరణించిన 12వ రోజునే షూటింగ్ కు వెళ్లాల్సి వచ్చిందని... తల్లిదండ్రులు లేని ఆడపిల్లను ఇండస్ట్రీలో అందరూ టార్గెట్ చేస్తారని తెలిపింది. అంతేకాకుండా, సినిమాలలో అవకాశాలు రావాలంటే పార్టీలకు వెళ్లాలని, తెలుగు అమ్మాయి మాదిరి రిజర్వ్ గా ఉండకూడదని కొందరు సలహాలు ఇచ్చేవారని గుర్తు చేసుకుంది.



## శర్వానంద్‌కు కలసి వచ్చిన బాలయ్య సెంటిమెంట్



టాలీవుడ్‌లో కొన్ని చిత్రాలకు సంబంధించిన విశేషాలు భలే ఆసక్తికరంగా మారుతుంటాయి. అలాంటి సంఘటన ఒకటి హీరో శర్వానంద్ నటించిన నారి నారి నడుమ మురారి సినిమాకు జరిగింది. శర్వా హీరోగా రామ్ అబ్బరాజు డైరెక్షన్ లో అనిల్ సుంకర నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా రిలీజ్ అయి సూపర్ హిట్ గా నిలిచింది. ఫెస్టివల్ సీజన్‌లో వచ్చిన చిత్రాల్లో చిన్న సినిమాగా వచ్చి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ పొందుతూ బాక్సాఫీస్ వద్ద బి÷–గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా మారింది.ఈ సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన విషయం ఇప్పుడు సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. దాదాపు 36 ఏళ్ల క్రితం నందమూరి బాలకృష్ణ హీరోగా, ఏ. కోదండరామిరెడ్డి దర్శకత్వంలో ’నారి నారి నడుమ మురారి’ అనే సినిమా విడుదలై అప్పట్లో సూపర్ హిట్‌గా నిలిచింది. అందుకే అదే టైటిల్‌ను శర్వానంద్ సినిమా కోసం ఫిక్స్ చేయగానే, అది బాలకృష్ణ సినిమా టైటిల్ కదా అని ఆయన అనుమతి తీసుకోవాలని శర్వానంద్ స్వయంగా బాలకృష్ణకు ఫోన్ చేసి విషయం వివరించగా, ఈ విషయం నాకెందుకు చెప్తున్నావు, నిరభ్యంతరంగా టైటిల్ పెట్టుకో అంటూ బాలయ్య గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. అంతేకాదు, టైటిల్ పెట్టుకోమని చెప్పడమే కాకుండా సినిమా షూటింగ్‌కు, టైటిల్ రివీల్ కు ముహూర్తం కూడా బాలకృష్ణ ఫిక్స్ చేశారట. ఇక భారీ సినిమాల మధ్య పోటీగా రిలీజ్ అయినా నారి నారి నడుమ మురారి శర్వా కెరీర్ లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచి ఇటు నిర్మాతలకు అటు డిస్ట్రిబ్యూటర్స్ కు భారీ లాభాలు తెచ్చిపెడుతోంది. ఈ విషయాన్నీ బాలయ్యకు చెప్పేందుకు శర్వానంద్ మరోసారి కాల్ చేయగా ‘నా పేరు కాపాడావు? సినిమా సూపర్ హిట్ అయిందని తెలిసింది. ఇలానే రాబోయే రోజుల్లో మరిన్ని మంచి సినిమాలు చేయాలి‘ అంటూ శర్వానంద్‌ను దీవించారట బాలయ్య. ఆ సంతోషాన్ని తన ఫ్రెండ్స్ తో షేర్ చేసుకుంటూ ఇక నుంచి నా సినిమాలన్నింటికీ బాలయ్యతోనే ముహూర్తం పెట్టించుకుంటాను అని అన్నారట. మొత్తానికి, బాలయ్య టైటిల్ తో ఆయన పెట్టిన ముహూర్తంతో శర్వానంద్‌కు భారీ హిట్ అందుకున్నాడు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613